RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -113 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

## మహిళా పారిశ్రామిక వేత్తలకు

# ప్రత్యేక రాయితీలు






**నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు**

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ భేటీ - 21 అంశాలకు కేబినెట్ ఆమోదం**

- రిజిస్ట్రేషన్ల కోసం అడ్వాన్స్ టైమ్ స్లాట్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా పారిశ్రామికవేత్తలకు
- అండగా నిలిచే పాలసీకి ఆమోదం
- రానున్న విద్యాసంవత్సరంలోనే తల్లికి వందనం
- ఏప్రిల్లో మత్స్యకార భరోసా అందజేత
- మంత్రులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. నామి నేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలకు.. 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2019లో చేసిన చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని నిర్ణయం చేసింది. గతంలో తీసుకొచ్చిన జీవో నంబర్ 77ను రద్దు చేయనుంది. అదే విధంగా వెనుకబడిన మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వనుంది. విద్యుత్ సహా పలు విభాగాల్లో పారి శ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వనుంది. ఏపీ నాలెడ్జ్ సొసైటీ కెపాసిటీ బిల్డింగ్ 2025కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీలు పెంచ కూడదని, అవకాశం ఉంటే తగ్గించాలని మంత్రులకు సీఎం చెప్పారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలు వేగంగా అమలయ్యేలా చూడాలన్నారు. బడులు తెరిచే నాటికి డీఎస్సీ పోస్టులను మంజూరు చేయాలని ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లపై పలువురు మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. బోగస్ రిజి స్ట్రేషన్లల కట్టడికి తగిన చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సందర్భంగా 21 అంశాలను ఏపీ కేబినెట్ ఆమోదించింది. మిగతాది 2లో...

# తొలి స్థానంలో ఫరూఖ్...

## చివరిస్థానంలో వాసంశెట్టి సుభాష్

- మంత్రుల పనితీరు ఆధారంగా ర్యాంకులు
- చంద్రబాబుకు 6వ స్థానం పదో స్థానంలో పవన్లోకేశ్ కు 8వ ర్యాంకు




అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: పనితీరు ఆధారంగా ఏపీ మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. ఫైళ్ల క్రియరెన్స్ ను ప్రధాన ప్రాతిపదికగా తీసుకుని ర్యాంకుల జాబితా రూపొందించారు. ఇందులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు 6వ స్థానం లభించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 10వ స్థానంలో ఉండగా... విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, హెచ్ఆర్ డీ శాఖల మంత్రి నారా లోకేశ్ 8వ స్థానంలో ఉన్నారు. ఈ మినిస్టర్స్ ర్యాంకింగ్స్ లో రాష్ట్ర న్యాయ శాఖ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ తొలి స్థానంలో నిలిచారు. 2వ స్థానంలో కందుల దుర్గేశ్, 3వ స్థానంలో కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. మిగతాది 2లో...

# కేంద్ర కేబిన్ ముందుకు కొత్త ఆదాయచట్టం

నేటి కేబినేట్ ఆమోదం అనంతరం పార్లమెంట్కు



2లో

## కష్టాలు వచ్చినప్పుడే

# ధైర్యంగా ఉండాలి

**కావాలనే వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు**

**లిక్కర్ కేసులో మిథున్రెడ్డికి ఏం సంబంధం**

**విలేకరుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్**



అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: కష్టాలు అందరికీ వస్తాయి, కానీ కష్టాలు తట్టుకుంటేనే ఇంకా రెట్టింపు మంచి రోజులు వస్తాయని ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు పార్టీని వీడటం సహా.. పార్టీ నేతలు, కార్యకర్తలపై నమోదవుతున్న కేసులపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తమ పార్టీ నేతలపై చంద్రబాబు సర్కార్ తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. అంతేకాదు.. లిక్కర్ విషయంలో మిథున్ రెడ్డి పేరును తీసుకురావడంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. మిగతాది 2లో...



2లో

# మైనారిటీ సంక్షేమానికి కేంద్ర నిధులు రాబట్టుకోవాలి

తెలంగాణ నుంచి రావాల్సిన రూ.50 కోట్లు పై దృష్టి సారించాలి

మైనార్టీ సంక్షేమ శాఖ సమీక్షలో అధికారులను ఆదేశించిన మంత్రి ఫరూక్

## అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు



అక్రమ వలసదారులను భారత్ కు తిప్పి పంపిన అమెరికా

రాజ్యసభలో ప్రకటన చేసిన కేంద్ర విదేశాంగ మంత్రి: జై శంకర్

2009 నుంచి ఇలాంటి బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయని వెల్లడి 2లో

# ధరల అదుపుకు చర్యలు

- ధరల పర్యవేక్షణపై ఏపీ మంత్రుల కమిటీ సమావేశం...
- మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన సమావేశం
- హాజరైన ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య శాఖ మంత్రులు
- మార్కెట్ ధరలు, ద్రవ్యోల్బణం నివారణకు చర్యలపై చర్చ



అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశం జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మార్కెట్ ధరలపై నిత్యం పర్యవేక్షణ, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు, మిల్లెట్ల (తృణధాన్యాలు) ప్రోత్సాహం, ప్రస్తుత మార్కెట్ లో ధరల పరిస్థితిని సమీక్షించారు. మిగతాది 2లో...

# అమరావతిలో పనులకు అభ్యంతరం లేదన్న కేంద్ర ఎన్నికల సంఘం

**ఏపీలో ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు అమల్లో ఉన్న కోడ్**

**పనులకు అనుమతి కోరుతూ ఈసీకి లేఖ రాసిన సీఆర్డీఏ**

**అనుమతి ఇస్తూ తిరిగి లేఖ రాసిన ఈసీ**



అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం తియ్యని కబురు చెప్పింది. అమరావతిలో పనులకు అభ్యంతరం లేదని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు టెండర్లు పిలిచేందుకు అనుమతి ఇస్తూ సీఆర్డీఏకి ఈసీ లేఖ రాసింది. ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సీఆర్డీఏ రాసిన లేఖకు స్పందనగా ఈసీ తాజాగా లేఖ పంపింది. ఫిబ్రవరి 27న రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కృష్ణా-గుంటూరు, తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేషన్ స్థానాలకు... విజయనగరం-శ్రీకాకుళం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవలే షెడ్యూల్ కూడా విడుదలైంది.

## మొదటి భర్తతో విడాకులు తీసుకోకున్నా.. రెండో భర్త నుంచి భరణానికి భార్య అర్హురాలే



తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన పిటిషనర్

ఆమెకు అనుకూలంగా తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు

సెక్షన్ 125 క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం భరణానికి ఆమె 2లో

# మైనారిటీ సంక్షేమానికి కేంద్ర నిధులు రాబట్టుకోవాలి

## తెలంగాణ నుంచి రావాల్సిన రూ.50 కోట్లు పై దృష్టి సారించాలి

## మైనార్టీ సంక్షేమ శాఖ సమీక్షలో అధికారులను ఆదేశించిన మంత్రి ఫరూక్

అమరావతి ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:
రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ఉద్దేశించిన ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను రాబట్టుకునేందుకు ఢిల్లీకి వెళ్లి సాధించాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలోని తన ఛేషీ లో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్, కమిషనర్ శ్రీధర్, తదితర అధికారులతో మంత్రి సమీక్ష చేశారు. 2024-2025 బడ్జెట్లో కేటాయించబడిన నిధులను విడుదల చేయించుకోవడంతో పాటు, 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మైనార్టీ శాఖకు కావాల్సిన ఆర్థిక బడ్జెట్ సంబంధ విషయాలను క్రోడీకరించి పూర్తి నివేదిక రూపకల్పన చేయాలని ఆదేశించారు. సీసీటీవీలు,డ్రోన్లు, తదితర సాంకేతిక పరికరాలను అవసరమున్న చోట వినియోగించాలని సూచించారు. రంజాన్ మాసం సమీపిస్తున్న నేపథ్యంలో మసీదుల నిర్వహణకు ప్రతి నెల రూ.5000 ఆర్థిక సాయం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నవరం ఎయిర్ పోర్టు నుండి హజ్ కి వెళ్లే యాత్రికులకు రూ. 1 లక్ష ఆర్థిక సాయం పంపిణీకి సంబంధించి గైడెన్స్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ కార్యాలయాలు ఈ-ఆఫీస్ వాడాలని, పేపర్ ఫైళ్లను వెనక్కి పంపాలని ఆదేశించారు. రాష్ట్రంలోని దర్గాలు, పెద్దపెద్ద మసీదులు, హాస్టళ్లలో సీసీటీవీ లతో పర్యవేక్షణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మైనార్టీలకు సంబంధించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకి



అందేలా జిల్లాల వారీగా అధికారులు సమీక్షా సమావేశాలు, క్షేత్ర పర్యటనలు చేస్తూ ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. డీఎస్సీ కోచింగ్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణ, పూర్తయిన పిఎంజేవికే భవనాలకు సిబ్బంది, బడ్జెట్ కేటాయింపు, నంద్యాలలో ఏర్పాటు చేయబోయే స్కిల్ డెవలప్మెంట్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, సిఈడీఎం శాఖ ఏర్పాటు, త్వరలో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ఖాళీలను ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకువెళ్లి నోటిఫై అయ్యేలా చర్యలు తీసుకోవడం, ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు, ప్రజలకు సత్వర,ఖచ్చితమైన సమాచారం అందించేందుకు వీలుగా అన్ని చర్యలు చేపట్టాలని, వెబ్సైట్లను అప్డేట్ చేయాలని తదితర అంశాలపై సమీక్షలో అధికార యంత్రాంగంతో మంత్రి ఫరూక్ కూలంకషంగా చర్చించారు.తెలంగాణ నుంచి రావాల్సిన రూ. 50 కోట్లు, ఫైళ్లు,రికార్డులు పొందేందుకు హైదరాబాదుకు వెళ్లి అక్కడి అధికారులతో కలిసి రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు

### హైకోర్టు బెంచి, నల్సార్, ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటుపై సమీక్ష

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు, రాజధానిలో నల్సార్ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన స్థల సేకరణ, నిధుల కేటాయింపులు తదితర అంశాలపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్షించారు. గురువారం తన పేషీ కార్యాలయంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, తదితరులతో న్యాయ శాఖకు సంబంధించి పాలనాపరమైన పలు అంశాలపై మంత్రి సమీక్ష చేశారు. హైకోర్టు బెంచి, నల్సార్, ఇంటర్నేషనల్ లా స్కూల్ కు సంబంధించి అన్ని చర్యలు వేగవంతం చేయాలని, అవసరమైతే సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కొత్త కోర్టుల ఏర్పాటు, కొత్త భవనాల, క్వార్టర్స్ నిర్మాణానికి, వసతుల కల్పన కు అవసరమైన బడ్జెట్ అంచనాలను 2025-2026 బడ్జెట్ లో కేటాయింపుల కోసం నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. న్యాయ సలహా కోసం వచ్చే ఫైళ్లకు సంబంధించి వీలైనంత త్వరగా సలహా ఇవ్వాలని మంత్రి సూచించారు. న్యాయశాఖకు సంబంధించి మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వ పథకాల నుండి అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిధులు రాబట్టేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, స్పెషల్ కోర్టులు, జూనియర్ న్యాయవాదులకు శిక్షణ తో పాటు పలు అంశాలపై మంత్రి ఫరూక్ సమీక్ష చేశారు.

# మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రాయితీలు

**(మొదటి పేజి తరువాయి)**
ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆసక్తి కర నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈఏపి ప్రాజెక్టులు మినహా ఏపి సీఆర్డీఏ చేపట్టే పనులకు టెండ ర్ల పరిమితి పెంపు కోసం నిభందనల సవరణ కోసం కేబినెట్ లో చర్చించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ఇకపై 34 శాతం రిజర్వేషన్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో బీసీలకు కీలక పదవులు దక్కే అవకాశం ఉంది. మొత్తం 21 అంశాలు ఏజెండాగా ఏపీ కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. ఏపీ మంత్రివర్గ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీ ఎస్సి ఎస్టీ, మైనారిటీ లకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2019 లో చేసిన చట్టాన్ని వెనక్కు తీసుకుంటూ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సమయంలో ఆ చట్టంలో లోటుపాట్లు సవరించేలా కొత్తం చట్టం తెచ్చే ప్రతిపాదన పై కేబినెట్ లో చర్చించి ఆమోదం తెలిపారు. టిటిడిలో పోటు లో పని చేసే వర్కర్ లను సూపర్ వైజర్ లుగా అప్గ్రేడ్ చేస్తూ కేబినెట్ లో చర్చించారు. వీరిని సీనియర్ అసిస్టెంట్ కేడర్ కు పదోన్నతి కల్పించే




ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. స్టాంపు లు రిజిస్ట్రేషన్ల శాఖ లో డాక్యుమెంట్ ల రిజిస్ట్రేషన్ కు డైనమిక్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రవేశ పెట్టే ప్రతిపాదన పై కేబినెట్ చర్చించింది. తిరుపతి జిల్లా లోని చెన్నై - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ లో భూములు కోల్పోయిన వారికి పరిహారం గా ఎకరానికి 8 లక్షల చొప్పున ఇచ్చేందుకు కేబినెట్ లో ప్రతిపాదించారు. భారత్ లో తయారైన విదేశీ మద్యం , బీర్, ఎఫ్ ఎల్ స్పిరిట్ ల పై అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ సవరణ కు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు సమాచారం. విశాఖ గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి గజాల వరకు అభ్యంతరం లేని భూముల నిర్మాణానికి క్రమబద్ధీకరణకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. గాజువాకను ప్రత్యేకంగా తీసుకుని ఈ ప్రాంతంలో వెయ్యి గజాల వరకు కూడా సవరణ చేయలని నిర్ణయం తీసుకున్నారు. కొంత కాలంగా చర్చగా ఉన్న పట్టాదారు పుస్తకం విషయంలో కూడా చట్టసవరణకు వచ్చిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ 2025కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎమ్ఎస్ఏఈ పాలసీని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి వారికి మరిన్ని ప్రోత్సహకాలు అందించే విధంగా కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకు న్నారు. పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతో పాటు.. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్త లను ప్రోత్సహించాలని నిర్ణయించారు. మరోవైపు పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించే అంశం పైన కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. సంక్షేమ పథకాల అమలు.. ఎమ్మెల్సీ ఎన్నికల తో పాటుగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ పైన మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.

# కల్లలవుతున్న యువత డాలర్ కలలు

## ఉపాధి, ఉద్యోగాల వేటలో మోసపోతున్న నేటితరం - కేంద్రం అసమర్థ విధానాలే దీనికి కారణం

న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:
యువత డాలర్ కలలు కల్లలవుతున్నాయి. అమెరికా వెళ్లి నాలుగు రాళ్లు సంపాదించుకోవాలనుకున్న వారి ఆశలు గల్లంతవుతున్నాయి. దేశంలో ఉద్యోగాలు దొరక్క, ఉపాధి దక్కక విధిలేని పరిస్థితుల్లో లక్షలాది మంది ఉద్యోగాలు, ఉపాధి వెతుక్కుంటూ అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. కొందరు ఏజెంట్ల చేతిలో మోసపోతున్నారు. అమెరికా లాంటి దేశాల్లో ట్రంప్ లాంటి వారు రావడంతో తట్టుబుట్టా సర్దుకోకుండానే తిరుగు టపా కట్టాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశంలో వనరులు ఉన్నా, చేసుకునేందుకు పనివున్నా, అవకాశాలు కల్పించకపోవడం వల్లనే ఈ దర్గతిఏర్పడుతోంది. దీనిపై పార్లమెంటు చర్చించాలి. తాజాగా మరోమారు అమెరికా కలలు కంటూ.. తమ కుటుంబాలకు మంచి జీవితం ఇద్దామనుకొని అక్కడికి వెళ్లిన వారి ఆశలు అడియాశలు లయ్యాయి. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయింది. ఈక్రమంలో వారి దీనగాథలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అగ్రరాజ్యం ప్రత్యేక విమానంలో వెనక్కి పంపించింది. మొత్తంగా 104 మంది ఆ విమానంలో స్వదేశానికి చేరుకున్నారు. అక్రమమార్గంలో విదేశాలకు వెళ్లొద్దని కోరుతున్నా ఆవేదన వ్యక్తంచేశారు. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం






అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో అమెరికా వెనక్కి పంపిన వారిలో 33 మంది చొప్పున హరియాణా, గుజరాత్‌ల నుంచి, 30 మంది పంజాబ్ నుంచి, ముగ్గురేసి చొప్పున మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌ల నుంచి, ఇద్దరు చండీగఢ్ నుంచి ఉన్నారు. అమృత్‌సర్‌కు తీసుకొచ్చిన వారిలో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు ఉన్నారు. అమృత్‌సర్‌కు చేరుకున్న అక్రమ వలసదారులను పోలీసులు తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించాక ఇళ్లకు పంపారు .దీంతో అమెరికాలో వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మబలికిన ఏజెంట్‌కు రూ.42 లక్షలు ఇచ్చి హర్వీందర్ సింగ్ దారుణంగా మోసపోయాడు. ఆయనది పంజాబ్‌లోని హోషియాపుర్‌కు చెందిన తహ్లీ గ్రామం. తర్వాత వీసా రాలేదని చెప్పడంతో దిల్లీ నుంచి ఖతర్.. అక్కడి నుంచి బ్రెజిల్ వెళ్లి నానాయాతన పడుతూ అమెరికా వెళ్లాడు. ఇప్పుడు ట్రంప్ ఎఫెక్ట్‌తో ఉన్న డబ్బు పోయి, ఎక్కడ మొదలు పెట్టాడో అక్కడికే వచ్చి నిల్చున్నారు. దారాపుర్ గ్రామానికి చెందిన సుఖ్‌పాల్ సింగ్ కూడా ఇలాంటి దుస్థితినే ఎదుర్కొన్నారు. 15 గంటల పాటు సముద్ర ప్రయాణం చేసి, దాదాపు 45 కి.మీ. పర్వతమార్గంలో ముందుకెళ్లారు. 'ఎవరైనా గాయపడితే.. వారి పరిస్థితి అంతే. మిగిలేది మరణమే. దారివెంట ఎన్నో మృతదేహాలను చూశాం. ఇక కొద్దిసేపట్లో మెక్సికో సరిహద్దు దాటి అమెరికాలో అడుగుపెడతామనగా జలంధర్‌కు చెందిన ఓ వ్యక్తి అరెస్టు కావడంతో మా ప్రయాణం అంతా వృథా అయింది. దాంతో మమ్మల్ని 14 రోజులపాటు చీకటి గదుల్లో బంధించారు. సూర్యుడు జాడే లేకుండా పోయింది. అక్కడ వేలాది మంది పంజాబీ కుటుంబాలకు చెందిన యువకులు, పిల్లలు కనిపించారు. అందరిదీ ఒక్కటే దుస్థితి. ఇలాంటి దుస్తితి ఎందుకన్నదే ప్రశ్న. మనదేశంలోనే మనం పనిచేసుకునే అవకాశాలు పెరగాలి. అప్పుడే దేశ ఆర్థిక పరిస్థితి కూడా పెరగగలదని ప్రభుత్వం గుర్తించాలి.

# కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి

**(మొదటి పేజి తరువాయి)**
లిక్కర్ కేసులో మిథున్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. మిథున్ రెడ్డి తండ్రి ఏ శాఖ మంత్రి.. ఆయనకు మద్యానికి సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. ఎవరో ఒకరిని ఇరికించడం, కేసు పెట్టడం ద్వారా వైసీపీని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని జగన్ ఆరోపించారు. 'ఎవరైనా డబ్బులు ఎందుకు ఇస్తారు.. మద్యం రేట్లు మేము పెంచామా.. మద్యం బేసిక్ రేట్లు పెంచి.. సరఫరా తగ్గించినందుకు నాకు లంచాలు ఇస్తారా.. రేట్లు పెంచి సరఫరా పెంచిన చంద్రబాబుకు మామూళ్లు ఇస్తారా.. నాలాగా ఎందుకు చంద్రబాబు బటన్ నొక్కలేకపోతున్నారు.. నాకు డబ్బుపై వ్యామోహం లేదు.. అందుకే డీబీటీలో రెండున్నర లక్షల కోట్లు ఇచ్చాం.' అని వైఎస్ జగన్ తాను చేసిన పనులను చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో వైసీపీని వీడుతున్న రాజ్యసభ సభ్యుల అంశాన్ని జగన్ ప్రస్తావించారు. ముఖ్యంగా.. విజయసాయి రెడ్డి అంశాన్ని పేర్కొన్నారు. 'వైసీపీ నుంచి బయటకు వెళ్లే ప్రతి రాజ్యసభ సభ్యుడికి విశ్వసనీయత ఉండాలి. ప్రలోభాలకు లొంగో.. భయపడో లేక రాజీపడో అటు పోతే.. విశ్వసనీయత సంగతేంటి.. రాజకీయాల్లో కష్టాలు ఉంటాయి. ఐదేళ్లు కష్టపడితే మన టైమ్ వస్తుంది. విశ్వసనీయత ముఖ్యం. ఇది విజయసాయిరెడ్డికైనా మిగతా వారికైనా వర్తిస్తుంది.' అని జగన్ అన్నారు. ఇక అసెంబ్లీకి రావడంపైనా జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి వస్తే తమకు మాట్లాడే సమయం ఇస్తారా? అని జగన్ ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎంకు ఎంత సమయం ఇస్తారో తమకూ అంతే సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లేది లేదని తేల్చి చెప్పారు జగన్. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత జగన్ అసెంబ్లీ ముఖం చేసింది లేదు. వైసీపీ తరఫున 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలుపొందడం.. అసెంబ్లీలో అధికారపక్షాన్ని ఎదుర్కోలేమోననే భయంతో.. జగన్ అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీకి రాకుండా ఉండేందుకు.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతామంటూ మెలిక పెట్టి కూర్చున్నారు జగన్. వాస్తవానికి ఆయన పార్టీ గెలిచిన ఎమ్మెల్యేల లెక్క ప్రచారం అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదు. అయినప్పటికీ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని జగన్ కోరడం.. రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

# ధరల అదుపుకు చర్యలు

**(మొదటి పేజి తరువాయి)**
మంత్రుల కమిటీ స్పందిస్తూ... డిసెంబర్ 2024లో ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం రేటు 4.34% కాగా, జాతీయ సగటు 5.22% కంటే తక్కువగా ఉందని వెల్లడించింది. ప్రభుత్వం 154 మండల కేంద్రాల్లోని సీపీ యాప్ ద్వారా ప్రతీరోజూ ధరల సేకరణ, విశ్లేషణ చేస్తోందని వివరించింది. అదేవిధంగా 151 రైతు బజార్ ధరలను విశ్లేషించడం జరుగుతుందని పేర్కొంది.కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 69 నిత్యావసర సరుకుల ధరలను క్రమం తప్పకుండా పర్యవేక్షించనున్నారు. వీటిలో ధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, మసాలాలు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే... కందిపప్పు (13%), గ్రౌండ్‌నట్ ఆయిల్ (4%), మిర్చి (27%) ధరలు తగ్గాయి. ఏపీ మిషన్ మిల్లెట్ వంటి పథకాల ద్వారా జొన్నలు, రాగులను ప్రోత్సహించేందుకు నిర్ణయించారు. మిడ్-డే మీల్స్, సంక్షేమ పథకాలలో మిల్లెట్లు చేర్చడం, అదే విధంగా మిల్లెట్ వాడకాన్ని ప్రోత్సహించడంపైనా అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు ధరల సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రుల కమిటీ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా ఖర్చులు అధికంగా ఉండడం కొన్ని ప్రాంతాల్లో ధరలు పెరగడానికి కారణం కావడంతో... ధరల అదుపుకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రుల కమిటీ ఆదేశాలు జారీ చేసింది.

# ఏపీ మంత్రులకు ర్యాంకులు...

**(మొదటి పేజి తరువాయి)**
నాదెండ్ల మనోహర్ 4, డోలా బాలవీరాంజనేయస్వామి 5, సత్యకుమార్ 7, బీసీ జనార్దన్ రెడ్డి 9, సవిత 11, కొల్లు రవీంద్ర 12, గొట్టిపాటి రవికుమార్ 13, నారాయణ, 14 టీజీ భరత్ 15, ఆనం రామనారాయణరెడ్డి 16, అచ్చెన్నాయుడు 17, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి 18, గుమ్మిడి సంధ్యారాణి 19, వంగలపూడి అనిత 20, అనగాని సత్యప్రసాద్ 21, నిమ్మల రామానాయుడు 22, కొలుసు పార్థసారథి 23, పయ్యావుల కేశవ్ 24వ స్థానంలో నిలిచారు. ఇక, ఈ జాబితాలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చివరిస్థానంలో ఉన్నారు.

# అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు

ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:
అమెరికా ప్రభుత్వం భారత్ కు అక్రమ వలసదారులను ప్రత్యేక విమానంలో తిప్పి పంపిన నేపథ్యంలో, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్ నేడు రాజ్యసభలో ప్రకటన చేశారు. అక్రమ వలసదారుల తరలింపు అనేది కొత్తేమీ కాదని అన్నారు. చాలా ఏళ్ల నుంచి దేశ బహిష్కరణలు జరుగుతున్నాయని, 2009 నుంచి ఇలాంటి బహిష్కరణలు చూస్తూనే ఉన్నామని తెలిపారు. ఇలాంటి బహిష్కరణల సమయంలో కొందరు ప్రాణాలు కోల్పోతుంటారని వివరించారు. అక్రమ వలసలను అరికట్టేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉందని జై శంకర్ స్పష్టం చేశారు. ఒక్క భారత్ అనే కాకుండా... అన్ని దేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోందని వెల్లడించారు. తమ దేశస్థులు చట్టవిరుద్ధంగా విదేశాల్లో ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

# మొదటి భర్తతో విడాకులు తీసుకోకున్నా.. రెండో భర్త నుంచి భరణానికి భార్య అర్హురాలే: సుప్రీంకోర్టు

ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:
మొదటి భర్తతో చట్టబద్ధంగా విడాకులు తీసుకోకున్నా రెండో భర్త నుంచి భరణం కోరే హక్కు భార్యకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోనందున రెండో భర్త నుంచి భరణం కోరే హక్కు ఆమెకు ఉండదంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు అనుకూలంగా తీర్పు చెప్పింది. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకోకుండా వేరుగా ఉంటూ, రెండో వివాహం చేసుకున్న భర్త నుంచి సెక్షన్ 125 క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం పరిహారాన్ని పొందవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. భరణం అనేది భార్య పొందే ప్రయోజనం కాదని, భర్త నైతికపరమైన, చట్టపరమైన విధి అని స్పష్టం చేసింది.

# కేంద్ర కేబిన్ ముందుకు కొత్త ఆదాయచట్టం

న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో త్వరలో కొత్త చట్టం రాబోతోంది. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. పాత చట్టంతో పోలిస్తే ఇందులోని నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఉండబోతున్నాయని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లుపై శుక్రవారం కేబినెట్‌లో చర్చించి ఆమోద ముద్ర వేయనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త బిల్లు తీసుకు రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల బ్జడెట్‌లో వెల్లడించిన సంగతి తెలిసిందే. కొత్త బిల్లులో ఆదాయపు పన్ను రేట్లు, శ్లాబులు, బ్జడెట్‌లో ప్రతిపాదించిన టీడీఎస్ నిబంధనలు సైతం పొందుపరచనున్నారు. ఈ బిల్లులో సుదీర్ఘ వాక్యాలు ఎక్కడా ఉండబోవని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే తెలిపారు. కొత్తగా ఎలాంటి పన్నులు గానీ, అదనపు భారాలు గానీ ఉండబోవన్నారు. కేవలం న్యాయ కోవిదులకే కాకుండా సామాన్యులు సైతం సులువుగా అర్థం చేసుకునే విధంగా ఉండాలన్న సంకల్పంతో ఈ బిల్లును రూపొందిచినట్లు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

# తలసేమియా బాధితుల కోసం 15న మ్యూజికల్ నైట్




అమరావతి,ఆంధ్ర ప్రగతి తలసేమియా బాధితుల సహాయం కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 15న విజయవాడలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాల వివరాలను నారా భువనేశ్వరి, తమన్ మీడియాకు వివరించారు. విజయవాడలో జరగనున్న మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు ఈ షో తాను చేయడం చాలా సంతోషంగా ఉందని మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అన్నారు. నారా భువనేశ్వరి ఈ కార్యక్రమం చేయాలి అని తనను అడిగారని.. తలసేమియా భాదితులకు సహాయం కోసం అని చెప్పగానే తాను వెంటనే ఈ కార్యక్రమంకి వస్తా అని చెప్పానన్నారు. నారా భువనేశ్వరి తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం తనకు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం పగలు రాత్రి పని చేస్తున్నారని, ఈ షో ద్వారా వచ్చే ప్రతి రూపాయి తలసేమియా భాదితులకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో ఈనెల 15 న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో యుఫోరియా మ్యూజికల్ నైట్ జరుగుతుందని నారా భువనేశ్వరి తెలిపారు. తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరవుతున్నారని చెప్పారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళు అని ఎన్టీఆర్ నమ్మారని, ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ ట్రస్టు ఏర్పాటు జరిగిందని ఆమె అన్నారు. రక్తదానం చాలా మంది జీవితాలను నిలబెడుతుందని.. రక్తదానం కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని ఆమె పిలుపిచ్చారు. తలసేమియా బాధితులు శ్వాస తీసుకోడానికి కూడా ఇబ్బంది పడతారని నారా భువనేశ్వరి అన్నారు. వారి కోసమే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె మరొకసారి స్పష్టం చేశారు.

........................................................................

## ఏపీలో కోళ్లలో ప్రబలుతున్న వింత వ్యాధి



అమరావతిఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కోళ్లలో ప్రస్తుతం ఒక వింత వ్యాధి వ్యాపిస్తోంది. దాదాపు 4 లక్షల కోళ్లు ప్రభావితమయ్యాయి. సమాచారం అందుకున్న పశు వైద్య శాఖ అధికారులు కోళ్ల ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. కోళ్ల నుండి రక్త నమూనాలను సేకరించి విజయవాడ, భోపాల్‌లోని పరీక్షా కేంద్రాలకు పంపారు. గత మూడు వారాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి ప్రాంతంలో తెలియని వైరస్ కారణంగా లక్షకు పైగా కోళ్లు చనిపోయాయి. మరణానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. అధికారులు ఇది వైరస్ అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. టీకాలు లేకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. గుడ్లు పెట్టిన నిమిషాల్లోనే కొన్ని కోళ్లు చనిపోయాయని రైతులు తెలిపారు. ఈ వైరస్ ఇతర కోళ్లలో వేగంగా వ్యాపించి, కోళ్ల పెంపకందారులకు పెద్ద నష్టాన్ని కలిగించింది. ఈ విషయంపై ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి. గోవింద రాజు మాట్లాడుతూ, గత మూడు వారాలలో ఒకే ప్రాంతంలో 35,000 కోళ్లు చనిపోయాయన్నారు. చనిపోయిన కోళ్లను సురక్షితంగా పూడ్చిపెట్టడానికి పశువైద్య అధికారులను వెంటనే పంపించినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని నివాసితులు కోళ్ల మాంసం తినకూడదని సూచించారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహకాలు విడుదల

**నగదు ప్రోత్సాహకాలు ప్రకటించిన ఎపి ప్రభుత్వం**

**శాప్ చైర్మన్ రవి నాయుడు వెల్లడి**



అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డితోపాటు శాప్ చైర్మన్ రవినాయుడు విజ్ఞప్తితో క్రీడా ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంపై శాప్ చైర్మన్ రవి నాయుడు గురువారం అమరావతిలో విలేకర్లతో మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రూ.11,68,62,288 క్రీడా ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రోత్సాహకాలు అందక దాదాపు 224 మంది రాష్ట్రంలోని క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. 189 మంది క్రీడాకారులకు రూ.7,96,62,289 నగదును కూటమి ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసిందన్నారు. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంతో సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్‌కు శాప్ చైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు..ప్రోత్సహకాలు విడుదల చేయడంపై క్రీడాకారులతో పాటు క్రీడా సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలోని క్రీడాకారుల సమస్యలను ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి రవి నాయుడు తీసుకు వెళ్లిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వంలో క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సాహకాలు అందజేయలేదు. దీంతో వందలాది మంది క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ?న్నారు. ఇక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆడుదాం ఆంధ్ర పేరుతో అట్టహాసంగా క్రీడలను ఏర్పాటు చేశారు. క్రీడాకారుల కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అందుకోసం భారీగా నిధులు సైతం కేటాయించారు. కానీ ఇది సైతం అంతగా సక్సెస్ కాలేదు. అంతేకాదు.. ఇందులో భారీ కుంభకోణం చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

# ఎన్నికల హామీలకు కట్టుబడి ఉన్నాం

**రానున్న రోజుల్లో**

**విద్యుత్ ఛార్జీలు పెరగవద్దు**

**సూర్యఘర్, పీఎం కుసుమ్**

**పథకాలను వేగవంతం చేయాలి**

**జనంలోకి వెళ్లే పథకాలపై**

**ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**మంత్రులకు సిఎం**

**చంద్రబాబు సూచన**



అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్‌మెంట్‌తో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదన్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్‌ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5 లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ఆయన కొద్దిసేపు మంత్రులతో మాట్లాడారు. వచ్చే మూడు నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు కీలకంగా వ్యవహరించి ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం అమలుపై మంత్రులతో చర్చించారు. ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని మంత్రులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రం మరో రూ.14 వేలు కలిపి ఇచ్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రంతోపాటు మూడు విడతలుగా రాష్ట్రం ఆర్థిక సాయం ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిపారు. బడులు తెరిచే నాటికి డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు. ఎన్ని పెట్టుబడులు అమల్లోకి వచ్చాయో ఎప్పటికప్పుడు పరిశీలించి అందుకు తగ్గట్టు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. శాఖల పరంగా మంత్రుల పనితీరు మెరుగుపడాలని సీఎం అన్నారు. అందరూ గేరు మార్చాలని సూచించారు. 'మొదటి ఆరు నెలలు మంత్రుల పనితీరును అంతగా పట్టించుకోలేదు. ఇకపై ఎవరినీ ఉపేక్షించను. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శాఖల వారీగా తీసుకోవచ్చు. వాట్సప్ గవరెన్స్‌కు మంచి స్పందన వస్తోంది. వివిధ పథకాల అమలు తీరుపై చేయిస్తోన్న సర్వేల్లో సానుకూల స్పందన వస్తోంది' అని అన్నారు.

ఇకపై నాణ్యమైన, పోషక విలువలు కలిగి సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై కేబినెట్‌లో చర్చ జరిగింది. మెనూలో చేసిన మార్పులపై సమావేశంలో లోకేశ్ వివరించారు. ప్రాంతాల వారీగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తీసుకొచ్చిన మార్పులను లోకేశ్ ప్రస్తావించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారాన్ని లోకేశ్ కోరారు. ఈ పథకం అమలుకు అవసరమైన నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## గీత కార్మికుల మద్యం షాపుల దరఖాస్తుకు 8 వ తేదీ వరకు గడువు పంపు..!

**-ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 38 దరఖాస్తులు వచ్చాయ్.**

**-సిండికేట్ అయిన దరఖాస్తుల తక్కువ వచ్చిన డ్రా తీయబడదు.**

**-స్వేచ్ఛగా నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి.**

**-గీత కార్మికులకు ఎక్సైజ్ సూపరిండెంట్ రవి కుమార్ విజ్ఞప్తి.**

**-రాష్ట్ర ప్రభుత్వం 10 నుండి 14 శాతానికి పెంచిన ప్రాఫిట్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: గీత కార్మికుల్లోని ఈడిగ, గౌడ గౌడ్ ఉపకులాలకు చెందిన వారికి కటాయించిన 11 మద్యం షాప్ లకు ఇప్పటి వరకు 38 దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 5 వ తేదీతో ముగియాల్సిన గడువును ఎనిమిదో తేదీ వరకు పొడిగించారని ఆసక్తి కలిగిన గీత కార్మికుల ఉపకులంలోని ఈడిగ, గౌడ, గౌడు లు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన చాంబర్లో విలేకరులతో మాట్లాడుతూ గీత వృత్తిదారులలోని ఉప కులాలకు 10 శాతం మద్యం షాపులను కేటాయించ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 335 షాపులను కేటాయించగా నంద్యాల జిల్లాలో 11 మద్యం షాప్ లను కేటాయించిందన్నారు. అందులో గౌడ్ ఉప కులానికి-3, ఈడిగ ఉప కులానికి-7, గౌడ ఉప కులానికి-1 మద్యం షాప్లను కేటాయించిన్నట్లు వెల్లడించారు.వీటిలో నంద్యాల, నందికొట్కూరు, జూపాడు బంగ్లా, డోన్, డోన్ రూరల్, ఉయ్యాలవాడ, పాములపాడు ఈడిగ ఉప కులానికి, ఆళ్లగడ్డ ఆత్మకూర్, కొత్తపల్లి గౌడ్ ఉప కులానికి కేటాయించగా, పగిద్యాల గౌడ ఉప కులానికి కేటాయించారన్నారు.నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఫిబ్రవరి 5 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎక్సైజ్ శాఖలో దరఖాస్తులు సమర్పించాలని ప్రకటించినప్పటికీ, దరఖాస్తులు తక్కువ రావడంతో ప్రభుత్వం 8 వ తేదీ వరకు గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఒకవేళ రహస్యంగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఆన్లైన్లో చేసుకోవచ్చన్నారు. %ష్ట్రజూటం జూతీశీయవష్. జశీఎ% లాగిన్ అయి వారి ఫోన్ నెంబర్ పెట్టుకుని ఓటిపిలో లాగిన్ అయిన ఏదైనా ఒక ఐడెంటి కార్డు నంబర్ వారి పేరు తండ్రి పేరు మూడు వివరాలు ఇచ్చి తన అకౌంట్లో ఉన్న రెండు లక్షలను నాన్ రిఫండబుల్ ఫీజు కడితే వీరికి వెంటనే ఎంట్రీ పాస్ వస్తుందన్నారు. దీన్ని తీసుకొని 10 వ తారీకు ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆఫీసుకు చేరుకోవాలన్నారు.అదే రోజు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డ్రా తీయనున్నట్లు ఆయన ప్రకటించారు. దరఖాస్తుతో పాటు గీత కార్మికుల్లోనే మూడు ఉప కులాలకు చెందిన ఈడిగ, గౌడ, గౌడులు తహశీల్దార్ల తీసుకున్న సబ్ కాస్ట్ సర్టిఫికెట్లను జతపరచాలన్నారు. ఒక వేళ తహసీల్దార్ ఇవ్వకుంటే కలెక్టర్ కు పిర్యాదు చేయవచ్చాన్నారు. ఇప్పటికే ఉపకులాలకు సంబందించి సర్టిఫికెట్లు ఇవ్వాలని తహసీల్దార్ లకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చియున్నారని ఆయన తెలిపారు. తన నంబర్ 8008828467కాల్ చేసిన సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.ఒక వేళ బోగస్ సర్టిఫికెట్లు సమర్పిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మున్సిపాలిటీలకు సంబంధించి దరఖాస్తుదారులు రెంటల్ ఎక్సైజ్ ట్యాక్స్లు రూ.35.75 లక్షలు, పగిద్యాల, జూపాడుబంగ్లా, డోన్ రూరల్, ఉయ్యాలవాడ, కొత్తపల్లి పాములపాడు సంబంధించిన దరఖాస్తుదారులు రూ.30.25 లక్షలు రెంటల్ ఎక్సైజ్ ట్యాక్స్లు చెల్లించాలన్నారు.లైసెన్స్ ఫీజు లో వీరికి 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కో షాపుకు 8 అప్లికేషన్లు వచ్చిన, తక్కువ వచ్చిన, సిండికేట్ అయినా మద్యం షాపులకు డ్రా తీయబడదని ఈఎస్ రవికుమార్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు భయానికి గురికాకుండా ప్రలోభాలకు గురి కాకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు విలేకరుల సమావేశంలో ఈఎస్ తో పాటు డివిజన్ సిఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్యం దుకాణాలకు లైసెన్స్ పొందిన వారికి ఊరట కలిగిస్తూ వారికి షేర్ కమిషన్ను 10 శాతం నుండి 14 శాతానికి పెంచడం జరిగింది. దీనివలన లక్ష రూపాయల వ్యాపారం ఇరిగితే వారికి 14 వేల రూపాయలు కమిషన్ వస్తుందన్నారు. అదేవిధంగా కల్లుగీత కార్మికులకు వారు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీనాటికి రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడం అయినది, కానీ ఫిబ్రవరి 8వ తేదీశనివారం నాడు బ్యాంకులు పనిచేయందున ఏడవ తేదీన బ్యాంకు దగ్గరికి వెళ్లి తామ చెల్లించాల్సిన రుసుమును చెల్లించి రిసిప్ట్ తీసుకురావాలని ఎక్సైజ్ అధికారులు కోరుతున్నారు. గీత కార్మికులందరూ ఎవరైతే వారి కోటాలో షాప్ పొందాలనుకుంటున్నారో, ప్రతి ఒక్కరు కూడా ఈడిగా సర్టిఫికెట్ పొంది దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

**భక్తుల రిజిస్ట్రేషన్‌పై అధికారుల సమీక్ష**



న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: :ఈ సంవత్సరం చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న అక్షయ తృతీయ పండుగ నాడు ప్రారంభమవుతుంది. గంగోత్రి, యమునోత్రి ధామ్ తలుపులు తెరవడంతో యాత్ర ప్రారంభం అవుతుంది. బద్రీనాథ్ ఆలయ తలుపులు మే 4న తెరుచుకుంటాయి. కేదార్‌నాథ్ ధామ్ తెరిచే తేదీని మహాశివరాత్రి పండుగనాడు నిర్ణయిస్తారు. ఈ మేరకు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన యాత్ర నిర్వహణ కమిటీ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే చార్‌ధామ్ యాత్ర సందర్భంగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, ఇంటర్నెట్‌ను ఉపయోగించలేని యాత్రికులు ఎటువంటి సమస్యను ఎదుర్కోకుండా ఉండటానికి ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా చేయబడుతుంది. చార్‌ధామ్ యాత్ర మార్గాల్లోని అన్ని పనులు ఏప్రిల్ 15 నాటికి పూర్తయ్యేలా చూడాలని పాండే ప్రజా పనుల శాఖను ఆదేశించారు. ఈసారి యాత్ర మార్గంలో ప్రతి పది కిలోమీటర్లకు చీతా పోలీస్ లేదా హిల్ పెట్రోలింగ్ యూనిట్ బృందాన్ని మోహరించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గర్వాల్ డివిజన్ రాజీవ్ స్వరూప్ కూడా సమావేశానికి హాజరయ్యారు. చార్‌ధామ్ యాత్ర కోసం దాదాపు రెండు వేల బస్సులను సిద్ధం చేశారు. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు యాత్ర ట్రస్ట్ గొప్ప శుభవార్త ప్రకటించింది. చార్‌ధామ్ యాత్రకు సంబంధించి యాత్ర ట్రాన్సిట్ క్యాంప్ ప్రాంగణంలో గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాత్ర పరిపాలన గత తప్పుల నుండి నేర్చుకుని, ఈసారి ప్రయాణీకుల నమోదు విధానాన్ని మార్చాలని నిర్ణయించిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఈ ఇబ్బంది నుండి ఉపశమనం పొందేలా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు 40 శాతం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇబ్బంది పడకుండా ఉండటానికి 40 శాతం రిజిస్ట్రేషన్లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని పాండే చెప్పారు. గతసారి, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎంపిక అందుబాటులో లేకపోవడం వల్ల యాత్రికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. హిమాలయ దేవాలయాలకు సాంప్రదాయ ప్రయాణ క్రమాన్ని రిజిస్ట్రేషన్ తర్వాత యాత్రికులకు ఇచ్చిన స్లాట్‌లలో జాగ్రత్తగా చూసుకోవాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ 17 మోటర్ సైకిళ్ళు సీజ్..!

## -వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి.





ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ ఫిబ్రవరి 06:నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల ఎస్ డి పి ఓ మంద. జావళి ఆల్ఫోన్స్ సూచనలతో నంద్యాల పట్టణంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలు ఉపయోగించి నేరస్తులు ఏదైనా నేరం చేస్తారనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 17 మోటార్ సైకిల్ లను సీజ్ చేయడం జరిగిందని తెలియజేశారు. కావున ప్రజలు ఎవరైనా నంబర్ ప్లేట్ లేని మోటార్ సైకిళ్ళు ,ఆటో లు మరి ఏ ఇతర వాహనాలను నడపరాదని పోలీస్ వారి సూచనలను ఎవరు ఉల్లంఘించిన సదరు వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..!

## -డ్రగ్స్ గంజాయిని నిర్మూలిద్దాం. -భవిష్యత్తును కాపాడుకుందాం.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:
యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక నంద్యాల పట్టణంలోని ఏ. ఎస్.పి కార్యాలయంలో డ్రగ్స్ అంతం డివైఎఫ్ఐ పంతం పోస్టర్స్ ను ఏ.ఎస్.పి మందా జావలి ఆల్ఫాన్ గారితో డివైఎఫ్ఐ నాయకులు పోస్టర్ ను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఏ.ఎస్.పి మందా జావలి ఆల్ఫాన్ గారు మాట్లాడుతూ ఇప్పుడున్న యువత డ్రగ్స్, గంజాయి కు అలవాటు అవుతున్నారు.దీనివలన వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాగే వారి కుటుంబాలు కూడా ఇబ్బందుల పడుతున్నారు. అందుకని యువత ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని మంచి భవిష్యత్తుకు అడుగులు వేయాలని వారు అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న డివైఎఫ్ఐ కమిటీ వారికి అభినందనలు తెలిపారు. అలాగే డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధు శేఖర్ లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందని, డ్రగ్స్ బారినపడి చెడిపోకుండా ఉండాలని వారు అన్నారు. దేశం లో వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేదస్సు, నైపుణ్యం అవసరమని దేశం ఔన్నత్యాన్ని నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువతలో ఉన్నాయని, మార్పు రావాల్సింది యువతలో మార్పు తేవాల్సింది కూడా యువతనేనని వారన్నారు. కానీ నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తి సామర్థ్యాలను కోల్పోయి నిర్వీరమై పరిస్థితి ఉందని వారన్నారు. గంజాయి డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలు వినియోగం వలన యువశక్తి పెడదారి పడుతుందన్నారు.యువతను మత్తులో ముంచి చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని వారన్నారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల అనర్థాలకు, అరాచకాలకు, హత్యలకు ప్రేరణగా నిలుస్తాయని వారన్నారు. డ్రగ్స్, గంజాయి వాడకం వంటి మత్తు వ్యసనాలకు దూరంగా చేయడం ద్వారా సమాజం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాయి, మార్ఫ్ స్టీవెన్, పాల్గొన్నారు.

# నంద్యాల 7, 8 వార్డు లలో వార్డు పర్యటన నిర్వహించిన ఎన్.ఎం.డి ఫిరోజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:
నంద్యాల వార్డు పర్యటనలో భాగంగా పట్టణంలోని 7 , 8 వార్డు బాల్కొండ హాల్ , తోట లైన్ నందు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పర్యటించి ప్రజలు అడిగి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని , త్రాగునీరుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల్లో తనకు నచ్చిన వారికే పథకాలు నచ్చని వారికీ పథకాలు అందకుండా చేయడం జరిగిందని, వార్డులో కృంగిపోయిన కరెంటు స్తంభాలు, వేలాడుతూ కరెంటు తీగలు వీధీ దిపాలు లేక రాత్రుల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇళ్ల మధ్యలో వర్షపు నీరు నిల్వ ఉండటం, కంప చెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని. అందుకే మన ఊరు మన బాధ్యత అను కార్యక్రమంలో భాగంగా ఎన్ఎండి ఫిరోజ్ వార్డు పర్యటనకు చేరుకోవడంతో వార్డు నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్ఎండి ఫిరోజ్ వార్డు మొత్తం ఇంటింటికి తిరిగి ప్రజలను నేరుగా కలుసుకొని వాళ్ళ సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ వార్డులో ఉన్న వివిధ సమస్యలను ఎన్ఎండి ఫిరోజ్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఎన్ఎండి ఫిరోజ్ ఏళ్ల తరబడిగా నెలకొన్న కఠిన సమస్యల గురించి ప్రభుత్వ అధికారులతో అక్కడికక్కడే చర్చించి వాటిని త్వరతగతిన పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయ్యాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చి వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఎంతో మంది అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందకపోవడంతో సచివాలయ సిబ్బందికి వాటి పై తక్షణం నివేదిక అందించాలని తెలపడం జరిగిందన్నారు. వార్డు ప్రజలు మమ్మల్ని ఇంతలా ఆదరించిన వారి సమస్యలను పరిష్కారం చేసేందుకు కచ్చితంగా కృషి చేస్తామని తెలిపారు.నంద్యాల టౌన్ 8వ వార్డు ఉప్పరపేట నందు నూతనంగా ప్రారంభమైన సచివాలయాన్ని వార్డు పర్యటనలో భాగంగా సందర్శించడం జరిగిందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని సచివాలయాన్ని సందర్శించడం జరిగిందని అదేవిధంగా ఇక్కడికి వచ్చేటువంటి ప్రజలకు సౌకర్యంగా ఉందో లేదో అని అక్కడ ఉన్నటువంటి ప్రజలని అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. సచివాలయానికి వచ్చిన వారి సమస్యలను ఎంత తొందర వీలైతే అంత తొందరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు టిడిపి ఇన్చార్జ్ ఉప్పర సురేష్ కుమార్, ఉప్పరి సుబ్రి, మాజీ కౌన్సిలర్ రవి కుమార్, గోవింద నాయుడు, పసుపులేటి నారాయణ , చింటూ మరియు వార్డు నాయకులు కార్యకర్తలు ప్రజలు మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# నా రూటే సపరేటు అంటున్న ఆద్య వైన్స్




**ఆంధ్ర ప్రగతి పాణ్యం ఫిబ్రవరి 06:** కొన్ని రోజులుగా జాతీయ రహదారి ఎన్ హెచ్ 40 తారు రోడ్డు పై గుంతలు పడినచోట ఒక లేయర్ తారు రోడ్డుని వేయడం జరిగింది.రోడ్ సేఫ్టీ అధికారులు మాత్రం ఆద్య వైన్స్ వైపుకు రోడ్డు వేయడం జరిగింది.ఎన్నో రోజులుగా రోడ్డు నుండి తీసివేయబడ్డ వేస్ట్ మెటీరియల్ తారును స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్ కళాశాల వద్ద కు వేయమని రోడ్డు వారిని విద్యార్థి,ప్రజాసంఘాలు అడుగగా వారు నిరకరించారు. ఈ(తారు)వేస్టేజ్ ను, జాతీయ రహదారికి ఇరువైపులా లిబరం"గా వినియోగించుకుంటారని ప్రజా సంఘాల నాయకులకు తెలపడం జరిగింది కానీ అమాత్యులు చెప్పడం వలన ఆధ్యా వైన్స్ వైపుకు దారి మళ్ళించడం జరిగింది. ఏదేమైనా తాగుడు బోతులకు వరంగా మారిన తారు రోడ్డు, ఆ స్కూల్ లో దాదాపుగా 1000 మంది విద్యార్థులు, 50 మంది అధ్యాపకులు ఉన్నారు. స్కూల్ ఏర్పడి 16 సంవత్సరాలనుండి ఇప్పటికి రోడ్డు లేక గ్రామస్తుల ఇళ్ల మధ్యలో కాలినడకతో నడచుకుంటూ వెళ్ళాలి. అక్కడ రోడ్డులేక గులాకరాళ్ల మద్యలో నడచుకుంటూ వెళ్ళాలి ప్రభుత్వాలు మారిన అధికారులు లో చలనము కూడా లేదు ఇప్పటికఇన అధికారులు స్పందించి స్కూల్ వినక బాగానే ఉన్న రోడ్డు వేయాలని విద్యార్థి ప్రజాసంఘాలు అధికారులను కోరుతున్నాం.

# నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి..!

**-సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు.**

**-ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలి.**

**-సిపిఐ పిలుపు మేరకు వేలాదిగా తరలివచ్చిన అర్జీదారులు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:
పట్టణంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు వేలాదిమంది అర్జీదారులతో ర్యాలీగా వచ్చి డిప్యూటీ తహశీల్దారు రామ సంజీవయ్యకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ ర్యాలీ కార్యక్రమం సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడులు మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలివ్వాలని గతంలో అనేకసార్లు అర్హులైన వారితో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గత ఐదేళ్లు పాలించిన జగన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల ఇల్లు నిర్మిస్తామని రాబోయే కాలంలో ఇంటి స్థలాలు ఇల్లు అడిగే పేదవారు లేకుండా చేస్తానని వాగ్దానం చేసి చేతులెత్తేసాడని ఆరోపించారు. పేదలను మరింత పేదవారిని చేసి గద్దె దిగిపోయాడని విమర్శించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రెండు సెంట్లు, మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల అని చెప్పి ఇంతవరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, సిపిఐ సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ లు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వారు వందల ల్, వేల ఎకరాలు ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమించుకుంటున్నా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడానికి అధికారులకు గానీ నాయకులకు గాని చేతులు రావడం లేదన్నారు. ఈరోజు నుండి ప్రభుత్వానికి ఆరు నెలల గడువు ఇస్తున్నామని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో ఇల్లు లేని నిరుపేదలతో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు లక్ష్మి దేవి, మాలన్ బి సుశీలమ్మ మున్ని, ఏఐటియుసి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి శ్రీనివాసులు, గోస్పాడు మండల సిపిఐ కార్యదర్శి హరినాథ్, మహానంది మండలం కార్యదర్శి సామేలు బేతంచర్ల మండల కార్యదర్శి భార్గవ్ సిపిఐ శాఖ కార్యదర్శి లో నంద్యాల పట్టణంలోని, వేలాదిగా అర్జీదారులు పాల్గొనడం జరిగింది.



# కృత్రిమంగా ఆక్సిజన్ ను కనుగొన్న శాస్త్రవేత్త శ్రీ జోసెఫ్ ప్రీస్ట్ లీ సేవలు చిరస్మరణీయం

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి



ఆంధ్ర ప్రగతి డోన్ ఫిబ్రవరి 06:
ఫిబ్రవరి 6 న కృత్రిమంగా ఆక్సిజన్ ను కనుగొన్న శాస్త్రవేత్త శ్రీ జోసెఫ్ ప్రీస్ట్ లీ వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో ఆక్సిజన్ కనుకొన్న శాస్త్రవేత్త శ్రీ జోసెఫ్ ప్రీస్ట్ లీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళు లర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.జోసెఫ్ ప్రీస్ట్లీ మార్చి 13, 1733 జన్మించారు. వాతావరణంలో సహజంగా కొద్దిగా మాత్రమే లభించే ఆక్సిజన్ను ప్రయోగశాలలో కృత్రిమంగా తయారు చేసే విధానాన్ని కనుగొన్న శాస్త్రవేత్త. కార్బన్ డయాక్సైడును కృత్రిమంగా చేయడాన్ని కనిపెట్టింది కూడా ఈయనే. ఇవే కాదు కార్బన్ మోనాక్సైడు, నైట్రస్ ఆక్సైడు (లాఫింగ్ గ్యాస్) లను కూడా ఈయనే ఆవిష్కరించారు. ఇవన్నీ వేర్వేరు సందర్భాలలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.ప్రఖ్యాత శాస్త్రవేత్త బెంజిమెన్ ఫ్రాంక్లిన్ ఇంగ్లండు పర్యటనతో స్ఫూర్తి పొంది విద్యుత్ పై అధ్యయనం చేసి 'హిస్టరీ అండ్ ప్రెజెంట్ స్టేట్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ' గ్రంథాన్ని రాశారు.అమెరికా నార్తంబర్లాండ్లో ఆయన ప్రయోగశాలలను నేషనల్ మ్యూజియంగా ప్రకటించారు. ఈయన ఫిబ్రవరి 6, 1804 స్వర్గస్తులైనారు. సమాజ సేవకులను శాస్త్రవేత్తలను ఎల్లవేళలా స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.







# లీజు గడువు ముగిసినా

## కొనసాగుతున్న శిల్పా దుకాణాలు..!



- ఏడాది గడుస్తున్నా ఖాళీ చేయించని అధికారులు.
- తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి బాడుగకు తీసుకున్నారు.
- రైతులకు,ప్రభుత్వానికి భారీగా నష్టం కల్గించింది.
- నూనె పల్లె మార్కెట్ యార్డు కొట్టేయడానికి కన్నేసిన నాయకులు.
- స్థలం మాదంటూ హైకోర్టులో రిట్ పిటిషన్.
- మంత్రులు,ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళతా.
- ఏపీ రాష్ట్రమార్క్ ఫెడ్ డైరెక్టర్ మరియు సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06:** ప్రభుత్వం రైతులకోసం ఏర్పాటుచేసిన వ్యవసాయ కమిటీకి చెందిన దుకాణాలు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కారు చౌకగా దుకాణాలు దక్కించుకునీ గడువు ముగిసినా వ్యాపారాలు సాగిస్తున్నారని మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. టెక్కే వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కల్పనా కుమారిని కలిశారు.ఈ సందర్భంగా మార్కెట్ యాడ్ డైరెక్టర్ తో మాట్లాడుతూ శిల్పా సహకార,శిల్పా మహిళా బ్యాంక్, నంది రైతు సమైక్య గడువు ముగిసినా ఎందుకు ఖాళీ చేయించలేదని ప్రశ్నించారు.దుకాణాలు తీసుకునే సమయంలో తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి తక్కువదరకు తీసుకున్నా డాక్యుమెంట్స్ ఎందుకు పరసిలించలేదన్నారు.ప్రస్తుతం 30.6.2024 లో గడువు ముగిసినా ఖాళీ చేయించలేదన్నారు.ప్రభుత్వానికి,రైతులకు నష్టం కల్గించినా పట్టించుకోకపోవడం విశేషమన్నారు.మార్కెట్లో చిన్న దుకాణం బాడుగకు తీసుకున్నా 10 వేలు పైనే ఉందని,వీరికి ఒకొక్క దుకాణం 2 వెలకే ఇచ్చి భారీ నష్టం కల్గించారని అన్నారు.గడువు ముగిసినా ఇప్పటివరకు ఎందుకు ఖాళీ చేయించలేదు,కనీసం నోతీసులైనా ఇచ్చారా అని ప్రశ్నించారు.అన్నిటికీ సమాధానం ఒక్కటే అని పిర్యాదు ఇవ్వండి చర్యలు తీసుకుంటాం అనే సమాధానం రావడం గమనార్హం.సామాన్యులకు ఒక న్యాయం ఉన్నవారికి ఒక న్యాయం అని తెలుస్తోంది.అనంతరం మార్క్ ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి మీడియా తో మాట్లాడారు.నంద్యాలలో మార్కెట్ యార్డు ను 1970 లో స్థాపించారని అన్నారు.నూనె పల్లిలో 1969 లో స్థాపించి అక్కడ కార్యాలయాలు,గౌడౌన్స్ కట్టించారన్నారు.మార్కెట్ యార్డు కు సంబందించి 1975 నుంచి ఎందరో ప్రముఖులు చైర్మన్లు గా పనిచేసారన్నారు.కొన్నేళ్ల క్రితం శిల్పా సహకార,శిల్పా మహిళా బ్యాంక్,నంది రైతు సమైక్య ను ఏర్పాటు చేసేందుకు మార్కెట్ యార్డ్ కు సంబంధించిన 20 దుకాణాలు తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి తక్కువధరకు లీజుకు తీసుకున్నారని ఆరోపించారు.లీజు సమయంలో డాక్యుమెంట్స్ సరిగా పరసిలించకుండా లీజుకు ఇచ్చారని,వాటికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మీడియా కు చూపించారు.అటు ప్రభుత్వానికి,ఇటు రైతులకు నష్టం కల్గించారని అన్నారు.స్వార్థ ప్రయోజనాల కోసం వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు.ప్రస్తుతం మార్కెట్లో ఏ దుకాణం బాడుగకు తీసుకున్నా 10 వేలు తక్కువ లేదన్నారు.దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి 20 దుకాణాలకు నెలకు 40 వేలు ఇస్తున్నారని అన్నారు.ప్రభుత్వ నిభందనలు మేరకు లీజు గడువు ముగిసిన తర్వాత ఖాళీ చేయకుండా ఎడదిగా వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు.గడువు ముగిసినా అధికారులు ఎందుకు ఖాళీ చేయించలేకపోతున్నారో అర్థం కానీ పరిస్థితి అన్నారు.లీజు డాక్యుమెంట్స్ లో ఆ దుకాణాల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించకూడదని ఉన్నా నిభందనలు విరుద్ధంగా శిల్పా మహిళా బ్యాంక్ లో సమావేశాలు నిర్వహిస్తున్నా అధికారులు మౌనంగా ఉన్నారని ఆరోపించారు.నంది రైతు సమాఖ్య కు సంబంధించిన డాక్యుమెంట్ ఎం.వి.కృష్ణా రెడ్డి పేరుతో స్టాంప్ తీసుకొని బి.రెడ్డి పేరుతో సంతకాలు ఉన్నాయని అన్నారు.శిల్పా సహకారు సైతం బి.రెడ్డి పేరుతో సంతకాలు ఉన్నాయని ఆధారాలతో సహా చూపించారు.గతంలో వారికి అనుకూలమైన చైర్మెన్ తో ఉత్తర్వులు పొంది తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి లీజు పొందరన్నారు.నూనె పల్లె మార్కెట్ యార్డ్ ప్రభుత్వ స్థలం అని అందరికీ తెలిసిన విషయమే అన్నారు.నూనె పల్లె మార్కెట్ యార్డు స్థలం ను కొట్టేయడానికి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి ఈ స్థలం మాదే అంటూ హైకోర్టు లో రిట్ పిటిషన్ వేసిన విషయాన్ని గుర్తుచేశారు.ప్రభుత్వ స్థలాలు,ఆస్తులను కొట్టేయాలని చూస్తున్నా అధికారులు మౌనంగా ఉండడం దారుణమని అన్నారు.శిల్పా సహకార,శిల్పా మహిళా బ్యాంక్, నంది రైతు సమాఖ్య ను ఖాళీ చేయించకుంటే చట్ట ప్రకారంగా వెళతానని అన్నారు.మహాశివరాత్రికి శ్రీశైలం కు వస్తున్న మంత్రులు ఎన్.ఎం.డి.ఫరూఖ్,అచ్చం నాయుడు,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళతానని అన్నారు.

## జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన శ్రీ గురురాజా పాఠశాల విద్యార్థులు




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06 : 2024 - 25 విద్యా సంవత్సరంలో వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొంటూ జాతీయ, రాష్ట్రస్థాయిలో సత్తా చాటి శ్రీ గురురాజా మీడియం పాఠశాలకు విద్యార్థినీ విద్యార్థులు పతకాలను సాధించారని పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి తెలిపారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయ, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్, వివిధ రకాల స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న సుమారు 45 మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారని అన్నారు. అండర్-14 అండర్ - 17 అండర్ బాల బాలికల విభాగాల్లో నిర్వహించిన త్రో బాలు ఫుట్బాల్, బాల్ బ్యాట్మెంటన్, ఖో- ఖో, సాఫ్ట్ బాల్, బేస్ బాల్, ఫెన్సింగ్, చెస్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభను చూపుతూ విజేతలుగా నిలిచారని అన్నారు. పాఠశాలకు క్రీడా పతకాలను సాధించడంలో ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని, అత్యుత్తమ పథకాలు సాధించేందుకు కృషి చేస్తున్న క్రీడాకారులను అందుకు శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

## ఉగాది నుండి రాష్ట్రంలో పి-4 విధానం అమలుకు చర్యలు.

### -రాష్ట ప్రధాన కార్యదర్శి విజయానంద్. -ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయండి.

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 06: రాష్ట్రంలో వచ్చే ఉగాది నుండి పి-4 (పబ్లిక్-ప్రవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్) విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. గురువారం అమరావతి నుండి పి-4 విధానంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి,డిఆర్ఓ రాము నాయక్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4 విధానాన్నిఅమలు చేయనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పి-4 విధానం ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విధి విధానాల రూపకల్పనకు ప్రజల నుండి సూచనలు,సలహాలు స్వీకరించండంతో పాటు దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొం దిస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడలు అధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు వెంటనే స్థలాలు గుర్తించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సున్నా పేదరికం- పి4 విధానం, నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్రణాళికల తయారీ కోసం నోడల్ అధికారులను నియమించాలని సిపిఓ ను ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో ఎంఎస్ఎంఈ సర్వే ప్రక్రియ అధిక స్థాయిలో పెండింగ్ ఉందని మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు సర్వేని వేగవంతం చేయాలన్నారు. ప్రగతి కనపరచని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఎస్ఎంఈకి సంబంధించి 650 మంది ఇంకా లాగిన్ కాలేదని సంబంధిత సిబ్బందికి కూడా షోకాజ్ నోటీసులను జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంప్లాయిస్ హౌస్ హోల్డ్ డేటా పూర్తి చేయడంలో వెనుకబడిన సిబ్బందిని వెంటనే నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్ల ఏర్పాటు కోసం భూములను గుర్తించాలని ఆర్డీఓలను సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ వేణుగోపాల్, డీఈవో జనార్దన్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డివిల్డిఓ శివారెడ్డి, డిపిఓ జమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో ముందు భాగంలో సర్పం హల్చల్..!

### -పడగ విప్పి ఆటాడిన సర్పం. -భయబ్రాంతులకు గురైన భక్తులు.

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 06: మహానంది క్షేత్రం ముందు భాగంలో నాగు సర్పం హల్చల్ చేసింది. అక్కడ ఉన్న భక్తులు భయపడి అక్కడ ఉన్న దేవస్థానం సిబ్బందికి తెలుపగా పాములు పట్టే మోహన్ కు తెలియజేయడం జరిగింది. అక్కడే ఉన్న మోహన్ వెంటనే వచ్చి పాములు పట్టి కొద్దిసేపు ఆడించి పాల ప్యాకెట్ తీసుకొచ్చి పాలు తాపాలని చూడగా అక్కడ ఉన్న నాగుపాము బుసలు కొడుతూ ఉండడంతో అక్కడే ఉన్న భక్తులు భయబ్రాంతులకు గురయ్యారు వెంటనే నాగుపామును సంచిలో బంధించి అడవి ప్రాంతంలో వదిలేయడం జరిగింది.



## ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని దుకాణదారులకు హెచ్చరిక.

### -ఎస్ ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి.

ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 06: ప్రజా అవసరాల దృష్ట్యా, దుకాణాలకు వచ్చి పోయే వారితోపాటు, రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు కలిగిస్తే, తగిన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం సాయంత్రం మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని మెట్ట యందు దుకాణదారులతో మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపరాదన్నారు.ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే వాహనాలను పెట్టుకొని వ్యాపారం చేసుకోవాలని వ



సూచించారు.ఒకవేళ వాహనాలు నిలిపితే, ఆ దుకాణదారులదే బాధ్యత అన్నారు.

**పదిమంది వాహనదారులకు జరిమానా..**

సరేనా ధ్రువపత్రాలు లేని పదిమంది వాహనదారులకు జరిమానాలు విధించినట్లు మహానంది ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని నంద్యాల- గిద్దలూరు జాతీయ రహదారి బోయలకుంట్ల ఆర్చి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని, లేని యెడల జరిమానాలు విధిస్తామని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడప రాదని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహానంది పోలీస్ సిబ్బంది, శేఖర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి మొదటి ప్రాధాన్యత దేశమే

**న్యూఢిల్లీ :** సమాజంలో కాంగ్రెస్ కులమత ద్వేశాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్రమంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని రాజ్యసభలో ధన్యవాద తీర్మానంపై చర్చించిన క్రమంలో పేర్కొన్నారు. మా విధానాలలో "నేషన్ ఫస్ట్" అనే స్ఫూర్తిని పరిగణించామని పేర్కొన్నారు. 2014 తర్వాత దేశం ఒక కొత్త నమూనాను చూసిందని చెప్పారు. కాంగ్రెస్ స్వార్థపూరిత రాజకీయాలు అందరినీ మోసం చేశాయని మోదీ వ్యాఖ్యానించారు.



**బాబా సాహెబ్ ఆలోచనలు..**

మేము బాబా సాహెబ్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి పేదలకు సహాయం చేశామని మోదీ అన్నారు. కాంగ్రెస్ దానిని గతంలో తీవ్రమైన సంక్షోభంగా మార్చిందని గుర్తు చేశారు. 2014లో మా ప్రభుత్వం ఈ ఆలోచనను పూర్తిగా మార్చేసింది. నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి మేము ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఆ క్రమంలో మొదటిసారి వ్యాపారంలోకి వస్తున్న వారికి ముద్ర పథకం ద్వారా ఎలాంటి హామీ లేకుండా రుణం ఇస్తున్నట్లు వెల్లడించారు.

**రంగులు మార్చడంలో..**

మనం చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ద్వేషించిందని, ఆయనపై ఎంత కోపంగా ఉందో మనకు తెలుస్తుందన్నారు మోదీ. బాబా సాహెబ్‌ను భారతరత్నకు ఎప్పుడూ అర్హులుగా పరిగణించలేదన్నారు. కానీ ప్రస్తుతం ఈ దేశ ప్రజలు బాబా సాహెబ్ భావాలను గౌరవించారు. ఈ సమయంలో కాంగ్రెస్ తప్పక జై భీమ్ అనాల్సి వస్తుందన్నారు. వాళ్ళు ఎప్పటికప్పుడు రంగులు మార్చుకుంటారని ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకంగా, ప్రభావవంతంగా, భవిష్యత్తు పనుల కోసం మనందరికీ మార్గదర్శకంగా ఉందన్నారు.

**నెహ్రూ సమయంలో కూడా..**

దేశానికి తొలి ప్రభుత్వ సమయంలో నెహ్రూ గారు ప్రధానమంత్రిగా ఉన్నారు. ఆ క్రమంలో ముంబైలో కార్మికుల సమ్మె జరిగింది. అందులో ప్రముఖ గీత రచయిత మజ్రూహ్ సుల్తాన్‌పురి బానిస అనే పాటను పాడారు. దీనికి గాను నెహ్రూ జీ అయనను జైల్లో పెట్టారు. ఆ క్రమంలో ప్రముఖ నటుడు బలరాజ్ సాహ్నీ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయనను కూడా జైల్లో పెట్టారు. లతాజీ సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఆల్ ఇండియా రేడియోలో వీర్ సావర్కర్ పై ఒక కవిత పఠించాలని అనుకున్నారు. దీని కారణంగా అయనను ఆకాశవాణి నుంచి బహిష్కరించారు.

**రాజ్యాంగ స్ఫూర్తిని..**

వీరి సమయంలో దేశం అత్యవసర పరిస్థితిని కూడా చూసిందన్నారు మోదీ. రాజ్యాంగాన్ని ఎలా తుడిచిపెట్టారో గుర్తు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కారు. ఇదంతా వారి అధికారం, ఆనందం కోసమే జరిగింది. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రముఖ కళాకారుడు దేవ్ ఆనంద్‌ని అత్యవసర పరిస్థితికి మద్దతు ఇవ్వమని కోరారు. దేవ్ ఆనంద్ నిరాకరించారు. దీంతో దూరదర్శన్‌లో దేవ్ ఆనంద్ సినిమాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత కిషోర్ కుమార్ కాంగ్రెస్ తరపున పాడటానికి నిరాకరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా రేడియోలో కిషోర్ పాటలను నిషేధించింది.

**దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టులకు..**

గతంలో పనులు ఎలా జరిగేవో ప్రధాని మోదీ ఉదాహరణతో సహా చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో వ్యవసాయం కోసం సరయు కాలువ ప్రాజెక్టు ఉంది. దీనికి 1972లో ఆమోదం లభించింది. అది 5 దశాబ్దాలుగా అలాగే కొనసాగింది. కానీ 2021లో మేము వచ్చి దీన్ని ప్రారంభించాము. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా ప్రాజెక్టుకు 1994లో ఆమోదం లభించింది. 3 దశాబ్దాల తర్వాత మేము దానిని 2025లో పూర్తి చేశాము. ఒడిశాలోని హరిదాస్‌పూర్-సారదీప్ రైల్వే లైన్ 1996లో ఆమోదించబడింది. మేము దీన్ని 2019లో కూడా కంప్లీట్ చేశాం. అసోంలోని బోగి బ్రిట్ 1989లో మంజూరు చేశారు. ఇది 2018లో పూర్తయింది. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టులను ఆలస్యం చేయడం ఒక సంస్కృతిగా మారిపోయిందన్నారు మోదీ. ఈ కాంగ్రెస్ సంస్కృతిని వదిలించేందుకు మేము 'ప్రగతి' అనే వ్యవస్థను సృష్టించి పూర్తి చేశామని మోదీ స్పష్టం చేశారు.

# అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు

**న్యూఢిల్లీ :** అమెరికా అక్రమ వలసదారులను తిరిగి స్వదేశానికి పంపుతోన్న తరుణంలో.. వారి పట్ల ఆ దేశం వ్యవహరిస్తున్న తీరుపై రాజ్యసభలో ప్రతిపక్షాలు గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాజ్యసభలో స్పందించారు. అక్రమ వలసదారులను స్వదేశానికి పంపడం నేడు కొత్తేమి కాదన్నారు. ఇది ఆ దేశ ప్రామాణిక విధానమని ఆయన తెలిపారు. విమానంలో వారిని తిరిగి తీసుకు వస్తున్న తరుణంలో వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం మాత్రం సరికాదని మంత్రి జైశంకర్ అభిప్రాయపడ్డారు. విదేశాలల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు తేలితే తమ పౌరులను తిరిగి తీసుకు రావడం అన్ని దేశాల ప్రాథమిక బాధ్యత అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అయితే ఇలా దేశం నుంచి వెనక్కి పంపుతోన్న వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించకుండా ఉండాలని.. అమెరికా అధికారులతో తాము సంప్రదింపులు జరుపుతోన్నట్లు ఆయన తెలిపారు. ఇక బహిష్కరణకు గురైన వారు అందించిన సమాచారం ఆధారంగా.. ఏజెంట్లు.. ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. ఇదే సమయంలో.. చట్టబద్ధమైన ప్రయాణికులకు వీసాలను సులభతరం చేయడంతోపాటు .. అక్రమ వలసదారులపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఉండాలన్నారు. అయితే మహిళలు, చిన్న పిల్లలతో ఈ విధంగా వ్యవహరించడం లేదని తమకు సమాచారం అందిందని తెలిపారు.



మరోవైపు లోక్‌సభలో.. యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని తిరిగి స్వదేశానికి పంపడంపై కాంగ్రెస్ ఎంపీలు మాణికం ఠాగూర్, గౌరవ్ గోగొయ్‌లతోపాటు కేసీ వేణుగోపాల్ ఇచ్చిన వాయిదా తీర్మానానికి సంబంధించి నోటీసులు అందజేశారు. అమృత్‌సర్‌లో బుధవారం సీ 17 యుద్ధ విమానంలో 104 మంది భారతీయ అక్రమ వలసదారులు యూఎస్ నుంచి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు యూఎస్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన వలసదారుల చేతులకు సంకెళ్లు వేశారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రతిపక్షాలు సైతం మండిపడుతోన్నాయి.

**బహిష్కరణపై ప్రభుత్వం మౌనం..**
**మండిపడుతోన్న ప్రతిపక్షాలు..**

అమెరికా నుంచి బహిష్కరణకు గురైన భారతీయుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు విమర్శించారు. అక్రమ వలసదారుల పట్ల వ్యవహరించిన తీరు పట్ల ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. ఈ ప్రయాణంలో తమ చేతులకు సంకెళ్లు వేశారని.. అమృత్‌సర్ విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం తమ చేతులకు ఉన్న సంకెళ్లు విప్పారంటూ అక్రమ వలసదారులు పేర్కొన్నారు. అదీకాక ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తోపాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలు అమెరికా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా.. పార్లమెంట్‌లో ప్రదర్శన నిర్వహించారు. అలాగే మరికొంత మంది నాయకులు అయితే చేతులకు సంకెళ్లు ధరించారు.

# వన్ టైమ్ టోల్ పాస్

**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై ప్రయాణించే మధ్యతరగతి, ప్రైవేట్ కార్ల యజమానులకు టోల్ ఛార్జీల వసూల నుంచి కొంత ఉపశమనం కల్పించేందుకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ సరికొత్త ఆలోచన చేస్తోంది. ఇప్పటి వరకు ఎప్పుడు టోల్ రోడ్డు ఎక్కితే.. అప్పుడు టోల్ ఛార్జ్ వసులూ చేస్తున్నారు. ప్రయాణించే దూరం, వాహనం రకాన్ని బట్టి ఈ టోల్ ఉంటుంది. అయితే.. కొత్త విధానంలో వార్షిక టోల్ పాస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. ఇది.. మధ్యతరగతి వర్గాలకు, ప్రైవేట్ కార్ల యజమానుల లబ్ధి చేకూర్చనుంది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రతిపాదిస్తున్న "వార్షిక టోల్ పాస్" ఆఫర్ ను తీసుకోవాలంటే.. కారు యజమానులు రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. పాస్ తీసుకున్నప్పటి నుంచి ఆ కారులో 12 నెలల పాటు దేశంలోని టోల్ రోడ్లపై అపరిమిత ప్రయాణం చేసే అవకాశం పొందుతారు. అదే తీరుగా.. "జీవితకాల పాస్" ఆప్షన్‌ను కూడా ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలుపుతున్నాయి. ఈ విధానంలో.. వాహన యజమానులు ముందుగానే రూ. 30 వేలు ముందస్తు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఈ ఆప్షన్ లో పాసు తీసుకున్న వారికి లైఫ్ టైమ్ అంటే.. 15 సంవత్సరాల పాటు టోల్ పాస్ పొందవచ్చు. జాతీయ రహదారుల ద్వారా ప్రయాణించే ప్రైవేట్ కార్ల యజమానులకు నెలవారీ పాస్‌లు అందిస్తున్నారు. వాళ్లు తీసుకున్న ఫాస్ట్ ట్యాగ్ లోనే ఈ సౌకర్యం కల్పించగా.. ఇందుకోసం నెలకు రూ. 340 చెల్లించాల్సి ఉంటుంది. అంటే సంవత్సరానికి ఒక్కో కారు యజమాని రూ. 4,080 చెల్లిస్తున్నట్లు. అలాంటి వాళ్లంతా.. ఈ కొత్త ఆఫర్ ద్వారా రూ. 3,000 తోనే, 12 నెలల పాటు టోల్ రోడ్లపై అపరిమిత ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తారని సమాచారం. అంటే.. ఏడాదికి రూ.1,080 ఆదా చేసుకోవచ్చు. ఈ కొత్త ఆఫర్ ను సైతం ఫాస్ట్‌ట్యాగ్ సిస్టమ్‌లోనే అమలు చేయనున్నారు. ఇప్పుడు వాడుతున్న ఫాస్ట్ ట్యాగ్ లోనే సరికొత్తగా ఏడాది, లైఫ్ టైమ్ ఆఫర్లను జోడించనున్నారు. ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా ఆ వివరాలు ఆటోమేటిక్‌గా గుర్తించనున్నారు. ఇది నిత్యం టోల్ రోడ్లపై తిరిగే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని కేంద్రం భావిస్తోంది.దేశంలో టోల్ రోడ్లు, వసూలు చేస్తున్న టోల్ రుసుములపై కొంత అసంతృప్తి ఉన్న విషయం అందరికీ తెలుసు. అందుకే.. కేంద్రం సైతం క్రమంగా టోల్ వసూళు లో కొత్త విధానాలు, ఆఫర్లు ప్రకటిస్తోంది. ప్రస్తుత ఆలోచన కార్యరూపం దాల్చితే.. హైవే వినియోగదారులకు టోల్ ఛార్జుల నుంచి మరింత ఉపశమనం కలుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయంపై ఇటీవల ప్రకటన ఇచ్చారు, ప్రైవేట్ కార్ల యజమానులకు వీలుగా, సౌకర్యం కలిగించే ఆఫర్లను తీసుకువస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గత సంవత్సరం 2023-24లో దేశంలో రూ. 55,000 కోట్ల టోల్ ఆదాయం వసూలైంది. ఈ ఆదాయంలో ప్రైవేట్ కార్ల భాగస్వామ్యం కేవలం 8,000 కోట్ల వరకు మాత్రమే ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. అయితే, టోల్ లావాదేవీలు, వసూళ్ల ధోరణి పరిశీలిస్తే.. 53% లావాదేవీలు ప్రైవేట్ కార్లవే అని తెలుస్తోంది. కానీ టోల్ వసూళ్లలో వాటా కేవలం 21% మాత్రమేగానే ఉంటోంది. అందుకే.. సరికొత్త విధానంలో వీరికి కొంత మేర లబ్ధి చేకూర్చాలని కేంద్రం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.అంతేకాకుండా, టోల్ ప్లాజాలలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య దాదాపు 60 శాతం ట్రాఫిక్ ప్రైవేట్ వాహనాలదే. అయినప్పటికీ, వాణిజ్య వాహనాల రాకపోకలు పగలు, రాత్రి అంతా దాదాపు సమానంగా ఉంటుంది. ఈయర్లీ పాస్ ఆఫర్ అమలు చేస్తే మొదట్లో నేషనల్ హైవే అథారిటీ కొంత ఆదాయాన్ని కోల్పోవచ్చని అంటున్నారు. అయినప్పటికీ, కొన్ని సంవత్సరాలలో ఈ పాస్‌లకు గిరాకీ పెరుగుతుందని, వాహనదారులు ఈ పాస్ లను తీసుకుంటారని అంటున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ కార్ల యజమానులు.. ఈ కొత్త సౌకర్యాన్ని ఉపయోగించుకొని జాతీయ రహదారులపై మరింత దూరం, మరిన్ని ఎక్కువ సార్లు ప్రయాణాలు చేస్తారని అంచనా వేస్తోంది.




## ఢిల్లీలో మేము ఓడిపోతాం.. గెలుపు ఆపార్టీదే

తేల్చేసిన కాంగ్రెస్ అగ్రనేత

ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీదే గెలుపు అంటూ అన్ని సర్వేలు స్పష్టం చేశాయి.




**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్నాయి. ఇక ఈ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియగానే.. ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీదే గెలుపు అంటూ అన్ని సర్వేలు స్పష్టం చేశాయి. అలాంటి వేళ.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ గురువారం న్యూఢిల్లీలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 5వ తేదీన జరిగిన న్యూఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మళ్లీ అధికారాన్ని చేపడుతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్‌లో సర్వేలు బీజేపీ విజయం సాధిస్తుందని చెబుతున్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం ఆప్ చాలా బలంగా ఉందన్నారు. అయితే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఆప్‌ను తక్కువ అంచనా వేశాయన్నారు. ఈ ఎగ్జిట్ పోల్స్ సర్వేలను విశ్వసించలేమని చెప్పారు. ఢిల్లీ ప్రజలు సైతం ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీల పట్ల ఆసక్తి కనబరిచారని పేర్కొన్నారు. శనివారం ఈ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని చెప్పారు. ఇక ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. ప్రభావం చూపిందన్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 17 నుంచి శాతం ఓట్లు సాధించ వచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో పార్టీ బాగా పోరాడిందన్నారు.

అయితే ఓటర్లు ఏ మేరకు మద్దతు తెలిపారో.. ఈ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించాలన్నారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. ఆప్, బీజేపీపై మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు.. ఓటర్లకు నగదు పంచి.. ఎన్నికల విశ్వసనీయతను దారుణంగా దెబ్బతీశాయన్నారు. తాను ఈ ఎగ్జిట్ పోల్స్‌ను విశ్వసించనన్నారు. ప్రజా తీర్పు.. బీజేపీ, ఆప్‌కు వ్యతిరేకంగా రానుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుతోందని ఎంపీ ప్రమోదు తివారీ వెల్లడించారు. మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీన ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 8వ తేదీన వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీనే విజయం సాధిస్తుందంటూ దాదాపు అన్ని సర్వేలు స్పష్టం చేశాయి. కానీ కేకే సర్వే మాత్రం ఆప్ ఘన విజయం సాధిస్తుందని ప్రకటించింది. అంతేకాదు.. ఢిల్లీ అసెంబ్లీ నియోజకర్గంలోని మొత్తం 9 జిల్లాల్లో ఆప్‌కి, బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయో సోదాహరణగా ఈ సర్వే వివరించింది. ఇక న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి ఆప్ అభ్యర్థిగా ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సందీప్ దీక్షిత్, బీజేపీ అభ్యర్థిగా పర్వేష్ వర్మ బరిలో నిలిచారు.?

## ఫిబ్రవరి 10న పరీక్షా పే చర్చ

**న్యూఢిల్లీ :** విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు పరీక్షల సీజన్‌లో ప్రధాన మంత్రి మోదీ ఏటా పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 10వ తేదీన ఢిల్లీలోని భారత్ మండపం టౌన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ సోషల్ మీడియా వేదికగా స్పెషల్ ఇన్విటేషన్ పలికారు. 'పరీక్షల సీజన్ తిరిగి వచ్చేసింది. పరీక్షా పే చర్చ ఈ ఏడాది కూడా మీ ముందుకొస్తుంది. అయితే ఈ సారి పరీక్షా పే చర్చ 2025 కార్యక్రమాన్ని కొత్త ఫార్మాట్‌లో సరికొత్తగా నిర్వహిస్తున్నాం. ప్రధాని మోదీ విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు, పరీక్షల ఆందోళన, ఒత్తిడిని అధిగమించడంలో సహాయపడటానికి అనుకూల చిట్కాలతో తిరిగి మీ ముందుకు వస్తున్నారు. పరీక్ష పే చర్య కార్యక్రమానికి విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను స్వాగతిస్తున్నా. రండి.. ప్రధాని మోడీతో కలిసి ఒత్తిడిని తగ్గించుకుందాం. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 10న ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది' అని తన ఎక్స్ ఖాతాలో వీడియో పోస్టులో మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అందరికీ ఆహ్వానం పలికారు. కాగా ఈ ఏడాది ప్రధాని మోదీతో పాటు పరీక్ష పే చర్చ 2025 కార్యక్రమానికి బాలీవుడ్ నటీనటులు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఇందులో పాల్గోనున్నట్లు అధికారులు ఇప్పటికే వెల్లడించారు. వీరిలో సద్గురు జగ్గీ వాసుదేవ్, బాలీవుడ్ నటి దీపికా పదుకొణె, 12 ఫెయిల్ నటుడు విక్రాంత్ మస్సే, భూమి పడ్నేకర్, దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్, పారా అథ్లెట్ అవని లేఖరా, రచయిత రుజుతా దివేకర్, ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ రాధికా గుప్తా, మానసిక నిపుణురాలు సోనాలీ సబర్వాల్, ఫుడ్ ఫార్మర్ రేవంత్ హిమత్‌సింగ్కా, టెక్నికల్ గురూజీ గౌరవ్ చౌధరీ వంటి ఎందరో ప్రముఖులు ఈ కార్యక్రమంలో కనిపించనున్నారు. ఈ పాడ్‌కాస్ట్ ఎపిసోడ్‌లో వీరు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తి నింపేందుకు వస్తున్నారు.



## కుప్పకూలిన మిరాజ్ యుద్ధ విమానం..
## పైలెట్లకు తీవ్ర గాయాలు..

వైమానిక దళానికి చెందిన మిరాజ్ 2000 యుద్ధ విమానం ఆకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ప్రమాదం సమయంలో అందులో పైలెట్ సహా మొత్తం ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. మిరాజ్ 2000 సాధారణ శిక్షణ కోసం బయలుదేరినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఆర్మీ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయ చర్యలు చేపడుతున్నాయి. అయితే యుద్ధ విమానం కూలిపోవడానికి గల కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో చోటుచేసుకుంది.



**ప్రమాదానికి కారణమిదేనా..**

విమానం నేలను ఢీకొట్టడానికి ముందే పైలట్లు బయటకు దూకేశారని అంటున్నారు. వారికి గాయాలు కాగా, ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. సాంకేతిక కారణాల వల్లే విమానం కూలిపోయిందని పలువురు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై వైమానిక దళం, జిల్లా పరిపాలన అధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాలను పర్యవేక్షించారు. ఆ ప్రదేశం నుంచి శిథిలాలను తొలగించే పని జరుగుతోంది. ఈ ప్రమాదం తర్వాత వైమానిక దళ అధికారులు మొత్తం ఈ ఘటన గురించి పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. మిరాజ్ 2000 ప్రమాదం వైమానిక దళానికి ఆందోళన కలిగించే విషయమని చెప్పవచ్చు. ఈ ఘటన వెనుక గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో సైన్యం విచారణకు ఆదేశించింది.

## ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్..
## నలుగురు మావోలు మృతి

ఛత్తీస్‌గడ్ : వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగులుతోంది. తాజాగా ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురు గాయపడినట్లు తెలుస్తోంది.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకెళ్లాలి

**బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణలపై ప్రజలకు వివరించాలి**

**విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిందే**

**స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపై దృష్టి సారించండి**

**సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పుకోండి**

**సిఎల్పి భేటీలో ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**

హైదరాబాద్ ,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో కొత్త పాత నేతలు సమన్వయంతో సాగితేనే స్థానిక సంస్థల్లో పాగా వేయగలమని సూచించారు. కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా బీసీ కులగణన చేపట్టామని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతా చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. అలాగే సమస్యలపై ఎమ్మెల్యేలు నేరుగా తనను కలుసుకోవచ్చని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇది



పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ విజయానికి శ్రమించాలని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. బీసీ కులగణను శాస్త్రీయంగా చేపట్టామని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాల స్థాయిలోనే కౌంటర్ అటాక్ చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్సీ వర్గకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, చెప్పామని, దానిని అమలు చేసి చూపామని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వివరించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఈ మేరకు సమావేశంలో నిర్ణయించారని సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపైనా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలుంటే తన వద్దకు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చని సీఎం చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై ప్రతిపక్షాలు లేని పోని అపోహలు సృష్టిస్తున్నాయని, అదే స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కౌంటర్ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం.

ఇదలావుంటే ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సీఎల్పీ సమావేశానికి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, సంజయ కుమార్, కృష్ణమోహన్ రెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కాలేదు. అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, కేసు సుప్రీంకోర్టులో ఉండటం.. టెక్నికల్ గా ఏ సమస్యా రాకుండా ముందు జాగ్రత్త చర్యలగా వీరు గైర్హాజరైనట్టు సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విసిల నియామకంలో యూజిసి పెత్తనం సరికాదు

**విద్యార్థుల ప్రయోజనాలకు ఇది విఘాతం**

**కేంద్రమంత్రికి కెటిఆర్ వినతి పత్రం అందచేత**

**ఎన్‌హెచ్ 365 పొడిగించాలని గడ్కరీకి కెటిఆర్ వినతి**

న్యూఢిల్లీ,,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6: యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. 'నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. మరోవైపు ఎన్‌హెచ్-365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామని కేటీఆర్ తెలిపారు.కెటిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో



కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట-సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరూద్ధమన్నారు.సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు. నిబంధనలను సవరించాలని మంత్రిని కోరామన్నారు. ఇలా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని చెప్పామన్నారు. అలాగే, జాతీయ రహదారి 365బీని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామన్నారు. ఇక పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనన్నారు. అనర్హత వేటు పిటిషన్లపై న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

# ఆర్జే శేఖర్‌బాషాపై మరో కేసు నమోదు



హైదరాబాద్,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:

లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో మస్తాన్ సాయి అరెస్ట్ అయి జ్యూడిషియల్ రిమాండ్‌కు వెళ్లారు. అలాగే బిగ్ బాస్ ఫేమ్,ఆర్జే శేఖర్ భాషాపై కూడా లావణ్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. శేఖర్ బాషాపై నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదు అయ్యింది. శేఖర్ బాషాపై కొరియోగ్రాఫర్ షష్టి వర్మ ఫిర్యాదు చేశారు. కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై షష్టి వర్మ గతంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. జానీ మాస్టర్ కేసులో విచారణ జరుగుతుండగా తన వ్యక్తిగత కాల్ రికార్డు లీక్ చేశాడని షష్టి వర్మ ఫిర్యాదులో పేర్కొంది. తన పరువుకు భంగం వాటిల్లేలా, కొన్ని యూట్యూబ్ ఛానెల్స్‌లో మాట్లాడుతున్నాడని మహిళా కొరియోగ్రాఫర్ క్లంపైట్ చేశారు. ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో ప్రైవేటు కాల్ రికార్డులు లీక్ చేశాడని ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. శేఖర్ బాషా వ్యక్తిగత మొబైల్‌తో పాటు, అతనితో ఉన్న ఇతర ఎలక్ట్రానిక్ డివైజెస్‌లు సీజ్ చేయాలని బాధితురాలు కోరింది. దీంతో శేఖర్ బాషాపై బీఎన్ఎస్ యాక్ట్ సెక్షన్ 79 ,67, ఐటీ యాక్ట్ 72 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు శేఖర్ బాషాపై లావణ్య ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు పోలీసులు. లావణ్యను ఉద్దేశపూర్వకంగానే డ్రగ్స్ కేసులో ఇరికించాలని ఇటు మస్తాన్ సాయి, శేఖర్ బాషా ప్రయత్నం చేశారంటూ ఓ ఆడియో పోలీసులకు ఇవ్వడంతో శేఖర్ బాషాపై కేసు నమోదు అయ్యింది. ఓవైపు డ్రగ్స్ కేసు, నగ్న వీడియోల విచారణ కొనసాగుతున్న సమయంలో ఆ కేసులో శేఖర్ బాషాను నిందితుడిగా చేర్చారు. మరోవైపు షష్టి వర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్జే పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

..............................................................................................

# నకిలీ యాప్స్‌తో మోసాలు

## ఖాతాదారులను హెచ్చరించిన ఎల్ఐసి




న్యూఢిల్లీ,,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:

ఫేక్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎల్ఐసి తన పాలసీదారులకు సూచించింది. తమ పేరు మీద నకిలీ యాప్స్ సర్క్యులేట్ అవుతున్నట్లు దృష్టికి రావడంతో తాజాగా పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. అలాంటి యాప్స్ వలలో పడొద్దని సూచించింది. 'ఎల్ఐసీ ఇండియా పేరు మీద కొన్ని నకిలీ మొబైల్ అప్లికేషన్లు చెలామణి అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కాబట్టి పాలసీహోల్డర్లు, కస్టమర్లు అప్రమత్తంగా ఉండాలి. ఎల్ఐసీ ఇండియా అధికారిక వెబ్‌సైట్, ఎల్ఐసీ డిజిటల్ యాప్, ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఇతరమార్గాల ద్వారా లావాదేవీలు జరపాలి' అని సూచించింది. ఇతర మార్గాల ద్వారా చేసే చెల్లింపులకు ఎల్ఐసీ బాధ్యత వహించబోదని స్పష్టంచేసింది. ఎల్ఐసీ అధికారిక యాప్‌ను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటే.. వెబ్‌సైట్‌లోకి వెళ్లి సంబంధిత లింక్‌పై క్లిక్ చేసి మీకు కావాల్సిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. నకిలీ యాప్స్ అని గమనిస్తే ఫిర్యాదు చేయాలని సూచించింది.

## రఘురామ నియోజకవర్గంలో

# ఐపీఎస్ సునీల్ మనుషులు?

అమరావతి,ఆంధ్ర ప్రగతి ఫిబ్రవరి 6:

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. ఇప్పటికే రఘురామపై కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ కుమార్ పై కేసు నమోదైన విషయం తెలిసిందే.. అయితే తాజాగా, రఘురామ నియోజకవర్గం ఉండి పరిధిలోని ఆకివీడులో పోలీసు స్టిక్కర్లు ఉన్న కారులో ఐపీఎస్ సునీల్ కుమార్ ఫొటోతో ముగ్గురు వ్యక్తులు హల్ చల్ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరు ఏదో ప్లాన్ తోనే ఆకివీడు వచ్చారని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఫైర్ అవుతున్నారు. కాగా, తన నియోజకవర్గంలో ఐపీఎస్ సునీల్ మనుషులు తిరగడాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామ సీరియస్ గా తీసుకున్నారు. ఈ విషయంపై స్పందించిన ఆయన ఇన్నోవా కారులో ఆకివీడు వచ్చిన వారి కోసం తాను ఆరా తీస్తున్నానని చెప్పారు. గుత్తికొండ వెంకట జోగారావు అనే వ్యక్తికి చెందిన కారులో వచ్చిన ముగ్గురు రౌడీయిజం చేశారని ఆరోపించారు. పోలీసు స్టిక్కర్ తగిలించుకున్న వ్యక్తులకు ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. పట్టపగలు



రౌడీయిజం చేయడానికి వస్తే పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఐపీఎస్ సునీల్ చెబితేనే వారు ఆకివీడు వచ్చారని తనకు తెలిసిందని రఘురామ చెప్పారు. సునీల్ కుమార్ అనుచరుడైన కారు యజమాని జోగారావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ మిషన్ పేరుతో ఆగఢాలు ఎక్కువ చేస్తున్నారని, ఆ సంస్థకు తనకు సంబంధం లేదని రఘురామ చెప్పగలరా? అంటూ ప్రశ్నించారు. ఆకివీడు ఘటనకు సునీల్ కుమార్ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రశాంతమైన ప్రాంతంలో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు చూస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "తన కస్టోడియల్ టార్చర్ కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదు" అంటూ వార్నింగ్ ఇచ్చారు. సునీల్ కుమార్ ను టీడీపీ వదిలిపెట్టినా తాను ఉపేక్షించనని చెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని తన హృదయానికి తెలుసు అని అన్నారు. అయితే ఆకివీడులో ఆక్రమణల తొలగింపు సందర్భంగా కొందరు సునీల్ కుమార్, అంబేద్కర్ ఫొటోలతో పట్టణంలోకి వచ్చారు. వారు స్థానికులు కాకపోవడంతో గొడవ చేసేందుకు వచ్చారనే సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. కారుతోపాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

# బలగం వేణు.. ఎల్లమ్మకు సర్వం సిద్ధం





బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగ్గి ÷నైల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.

# ఫిబ్రవరి 6న తెలుగు సినిమా దినోత్సవం

## ఏటా పండుగలా నిర్వహించాలని ఛాంబర్ నిర్ణయం




తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీని తెలుగు సినిమా దినోత్సవంగా సెలబ్రేట్ చేయాలని, అలాగే ఛాంబర్ తరపున ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాలు, నటీనటులకు అవార్డులు, పద్మ ఇంకా ఇతర అవార్డులు పొందిన వారందరినీ సన్మానించాలనేలా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6ను తెలుగు సినిమా పుట్టిన రోజుగా ఇకపై గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయనున్నట్లుగా తెలుపుతూ.. ఆ రోజున ప్రతి నటీనటుడి ఇంటిపైన, అలాగే రాష్ట్రంలోని థియేటర్లపైనా జెండా ఎగురవేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. ఈ మేరకు తెలుగు సినిమా పుట్టినరోజుకు సంబంధించిన జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ సినీ రచయిత పరిచూరి గోపాలకృష్ణకు అప్పగించినట్లు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖులు పాల్గొని.. ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఈ ఏడాది సింపుల్‌గా ప్రారంభించి, ప్రతి ఏడాది ఘనంగా చేయదలిచాము. తెలుగు సినిమా పుట్టుకను రాబోయే తరాలకు కూడా గుర్తుండేలా చేయాలన్నదే మా ప్రయత్నం. తెలుగు సినిమా చరిత్ర రాబోయే తరాలకు తెలియాలనే తెలుగు సినిమా దినోత్సవం జరపుతున్నాము. వచ్చే ఏడాది నుంచి గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేయటంతో పాటు.. ఆ ఏడాది ప్రతిభావంతులకు, పద్మ అవార్డ్ గ్రహీతలను సన్మానించే పరిశీలన చేస్తున్నాము. గద్దర్ అవార్డ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ప్రొ యాక్టివ్‌గా ఉంది. సినిమా ఇండస్ట్రీ గురించి, వ్యక్తుల గురించి తక్కువ చేసి మాట్లాడే వారిని ఎప్పటికప్పుడు ఛాంబర్ కట్టడి చేస్తూనే ఉంది. వివాదాస్పద కామెంట్స్ చేసే వారు తామెంటో కూడా చూసుకోవాలని సూచించారు. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6 తెలుగు సినిమా పుట్టిన రోజు. తమిళ వాళ్లు మాది అని చెప్పుకునే 'కాళిదాసు' మన తెలుగు సినిమానే. హిందీ తొలి సినిమా 'ఆలం ఆరా', తెలుగు వారి 'భక్త ప్రహ్లాద', తమిళ వారి 'కాళిదాసు' ఇలా అన్నీ సినిమాల్లో ఎల్ వి ప్రసాద్ యాక్ట్ చేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ ఇండస్ట్రీకి రెండు కళ్లలా తెలుగు సినిమా పరిశ్రమలో చరిత్ర సృష్టించారు. సినిమా వారంతా గర్వపడే రోజు ఇదని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 6ను ప్రతి ఏడాది తెలుగు సినిమా దినోత్సవంగా గ్రాండ్‌గా జరపనున్నాం. 1973లో నన్ను అట్లూరి పూర్ణచంద్రరావు పరిచయం చేశారు. వారు సినిమా రిప్రజంటేటివ్‌గా కెరీర్ ప్రారంభించి నిర్మాతగా మారి ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అని నటుడు మురళీమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మాలీవుడ్‌లోనూ ఒత్తిడి షరా మామూలే

## మలయళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్

ఈ మధ్యకాలంలో స్టార్ హీరోలు టాలీవుడ్ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు సంపాదించు కుంటున్నారు. ఇందులో మలయళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒకరు. 'సలార్' మూవీలో ప్రభాస్‌తో సమానంగా నటించి తెలుగులో తిరుగులేని పాపులారిటి దక్కించుకున్నాడు. తాజాగా స్వీయ దర్శకత్వంలో 'లూసిఫర్2: ఎంపురాన్' మూవీలో నటిస్తున్నాడు పృథ్వీరాజ్. ఇందులో మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించాడు. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా కోసం ప్రమోషన్ భారీగానే చెస్తున్నారు మూవీ టీం. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న పృథ్వీరాజ్ సుకుమారన్ మలయాళ ఇండస్ట్రీలో ఒత్తిడి గురించి వైరల్ కామెంట్స్ చేశాడు.. చాలా వరకు మిగతా ఇండస్ట్రీలలో ఉన్నంతగా ఓతిడి మాలీవుడ్ లో ఉండదు అంటారు నిజమా? అని ప్రశ్నించడంతో పృథ్వీరాజ్ స్పందిస్తూ.. ' మిగతా ఇండస్ట్రీల లాగే మలయాళంలో కూడా సినిమాకి లాభాలు రావడానికి చాలా ఒత్తిడి ఉంటుంది. అంత ఒత్తిడిలో కూడా మాలీవుడ్ గొప్ప సినిమాలు అందిస్తోంది. కానీ మంచి కథలు కాకపోతే ప్లాప్ అవ్వడం కాయం అని ప్రేక్షకులు ఇప్పటికే ఎన్నోసార్లు నిరూపించారు. ఈ విషయంలో వాళ్లకు కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే ఈ కారణంగా గత కొంత కాలంగా నటీనటులు ఎవరు? దర్శకుడు ఎవరు? అనే దానితో సంబంధం లేకుండా మంచి సినిమాలు భారీ కలెక్షన్లను సొంతం చేసుకుంటున్నాయి. మేము విజయం సాధించాం అనడానికి ఇదే నిదర్శనం. కథ బాగుంటే హీరో ఎవరనేదానితో సంబంధం లేకుండా మూవీ హిట్ అవుతాయి. అందుకే మంచి కథను ఎంచుకుంటే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నాం. మన పనికి మనం కట్టుబడి ఉంటే తర్వాత ఫలితాన్ని ప్రేక్షకులే అందిస్తారు' అని పృథ్వీరాజ్ సుకుమారన్ తెలిపాడు.




# లవ్‌యాపా అంటూ వస్తోన్న ఖుషీ కపూర్

'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం 7 నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ఎందుకంటే ఎమోషనల్ సీన్స్‌లలో నా ఖుషీ ఏడవడం బిగ్‌స్క్రీన్‌పై చూసినప్పుడు తట్టుకోలేను' అని రాసుకొచ్చారు. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్ . ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'లవ్‌యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే' . నేటితరం యువతీ యువకుల ప్రేమకథతో దీనిని రూపొందించారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్‌యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

# అందరూ దయతో ఉండండి

## రష్మిక ఇంట్రెస్టింగ్ పోస్ట్

ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తన సినిమా విశేషాలు పంచుకునే ఆమె తాజాగా దయగా ఉండండి అంటూ పోస్ట్ పెట్టారు. 'ఈ రోజుల్లో అందరిలో దయ తగ్గిపోతోంది. నేను మాత్రం అందరినీ ఒకేలా చూస్తాను. మీరంతా కూడా అలానే ఉండండి. ఒకరిపై ఒకరు దయతో ఉండండి' అని రాసుకొచ్చారు. తాను ధరించిన టీ షర్ట్ మీద కూడా దయ అనే రాసి ఉంది. దీంతో ఈ పోస్ట్‌పై నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా రష్మిక, విజయ్ దేవరకొండ జిమ్‌లో కలిసి కనిపించిన వీడియో వైరలైన విషయం తెలిసిందే. అయితే, జిమ్‌లో నుంచి బయటకు వచ్చిన విజయ్ కారులో కూర్చోగా.. రష్మిక కాలికి ఉన్న గాయం కారణంగా ఇబ్బందిపడుతూ కారు ఎక్కారు. ఈ వీడియోపై కొందరు విజయ్‌ను విమర్శిస్తున్నారు. రష్మికకు సాయం చేయొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్ వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రష్మిక నటించిన ఛావా విడుదలకు సిద్ధమైంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్'లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఇది రానుంది. అలాగే వీటితో పాటు 'థామ', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతోనూ రష్మిక బిజీగా ఉన్నారు.



# సాయిపల్లవి న్యాయం చేయగలదనే నమ్మకం

## అందుకే తండేల్‌లో ఎంపిక చేశా: అల్లు అరవింద్




తాజాగా ఓ ఇంటర్వ్యూలో అల్లు అరవింద్ మాట్లాడుతూ..'ఈ చిత్రంలో సాయి పల్లవి ఎంపిక నా నిర్ణయమే. ఇది కమర్షియల్ నిర్ణయమని చెప్పాలి. ఈ పాత్ర కోసం నేను ముంబయి వెళ్లి ఎవరినీ తీసుకురాలేదు. ముంబయి నుంచి వచ్చిన వైట్ స్కిన్ అమ్మాయిలు ఈ పాత్రకు జీవం తీసుకు రాలేరనిపించింది. ఇది ఎన్నో భావోద్వేగాలతో కూడిన పాత్ర. ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఇలాంటి గొప్ప పాత్రను నిజాయతీగా చేయాలి. సాయిపల్లవి అయితే వందశాతం న్యాయం చేయగలదని నాకు అనిపించింది. ఆమె అసాధారణమైన నటి. అందుకే ఆమెను ఎంపిక చేశాం. వైద్యులు ఆమెకు కనీసం రెండు రోజులు బెడ్ రెస్ట్ అవసరమని సూచించారు. అందుకే ఆమె ముంబయి వేదికగా జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొనలేకపోయారు' అని అన్నారు. కాగా, ఇప్పుడు ఆమె పూర్తిగా కోలుకొని తండేల్ ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు.